News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 04 | సంచిక :359 | ఖమ్మం | ఆదివారం ఫిబ్రవరి 8, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్..

## మోదీ మలేషియా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ

మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం

- మిగతా 2లో





# భారత రైతులకు పూర్తి రక్షణ..

## ట్రేడ్ డీల్ పై మంత్రి పీయూష్ గోయల

న్యూ దిల్లీ: అమెరికాతో ఇటీవల కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం పై కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూశ్ గోయల్ స్పందించారు. ఈ ట్రేడ్ డీల్‌లో భారత రైతులకు, ఎమ్ఎస్ఎమ్ఈ పరిశ్రమలకు పూర్తి రక్షణలు కల్పించామని చెప్పారు. అదే సమయంలో భారత వ్యవసాయ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసేందుకూ అవకాశం దక్కిందని అన్నారు. ఎర్రజొన్నలు, వైన్స్, స్పిరిట్స్ వంటి కొన్ని ఎంపిక చేసిన అమెరికా ఉత్పత్తులను మాత్రమే భారత్ లోకి అనుమతించినట్టు తెలిపారు.

- మిగతా 2లో



# రాష్ట్రానికి సీఎం రేవంతా? నేనా?

- కేసీఆర్‌పై చర్యలు తీసుకోలేకపోతే ఆయన రాజీనామా చేయాలి
- హార్వర్డ్ వెళ్లొచ్చాక సీఎం భాష మరింత దిగజారింది
- మోదీని ఎదుర్కొనేందుకు కేసీఆర్, సోనియా కుటుంబాలు కుమ్మక్కు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు

'కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకునేందుకు నేను అడ్డుపడుతున్నానని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారు.. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంతా? నేనా?' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోలేకపోతే రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 26 నెలలు గడుస్తున్నా.. ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలను అమలు చేయలేదు. మున్సిపల్

- మిగతా 2లో

- పంచాయతీ ఎన్నికల్లో బొంద పెట్టినా సిగ్గు రాలే
- వాళ్లకు ఫాంహౌస్‌లు వచ్చినా.. వికారాబాదు నీళ్లు ఇవ్వలే
- మనకు గోదావరి నీళ్లు రాకుండా అడ్డుకున్నది కేసీఆర్
- సబితా ఇంద్రారెడ్డి చేసిన ద్రోహానికి ఓట్లు అడిగే హక్కు లేదు
- మోదీని చూసి ఓటేయాలని బీజేపీ వాళ్లు అడుగుతుండ్రు
- పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తే.. పిల్లగాడు పనికి రాకపోతే ఏం చేయాలి?
- పరిగి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



కేసీఆర్.. కల్వకుంట్ల కిషన్ రావు

# రాసి పెట్టుకోండ్రి 8 ఏండ్లు మేమే

తెలంగాణలో ఇందిరమ్మ పాలనే కొనసాగుతది | కేసీఆర్‌కు అసెంబ్లీకి వచ్చే మొఖం లేదు | పదేళ్ల ద్రోహంపై సమాధానం చెప్పలేకే దూరం

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, కల్లకుంట్ల కిషన్ రావు గుర్తు పెట్టుకోండి తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఐదేండ్ల కోసం ఎన్నికైనం.. మరో ఐదేళ్లు పదవిలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లు పవర్‌లో ఉన్న బీఆర్ఎస్.. 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఏనాడు మన సమస్యలని పట్టించుకోలేదని విమర్శించారు.

శనివారం (ఫిబ్రవరి 7) ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి మండలం నారాయణపూర్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగా సభలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను ఓడించేం దుకు బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నాయని ఆరోపిం చారు. మూసీ నది ప్రక్షాళన చేస్తామంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని.. అభివృద్ధి పనులకు కాళ్లల్లో కట్టెలు పెడుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోడీని చూసి బీజేపీకి ఓటేయాలని తెలంగాణ బీజేపీ నేతలు అంటున్నారు. ఎక్కడైనా పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తామా అని ఎద్దేవా చేశారు. బీజేపీకి ఓటేస్తే ఢిల్లీ నుంచి మోడీ వచ్చి సమస్యలు తీర్చుతారా అని ప్రశ్నించారు. మోడీని చూసి ఓటేస్తే ఇక్కడి బోడీలు పని చేయరని టీ బీజేపీ నేతలను విమర్శించారు.

- మిగతా 2లో



# భారత వ్యాక్సీన్లు లేక పాక్ విలవిల.. 2031 నాటికల్లా..

అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న పాక్ కు భారత్ నుంచి అందుబాటు ధరల్లో టీకాలు నిలిచిపోవడంతో ఇక్కట్లు పెరిగాయి. 2031 నాటికల్లా స్థానికంగా టీకాల ఉత్పత్తిని పెంచకపోతే చిక్కుల్లో పడాల్సి వస్తుందని పాక్ ఆరోగ్య శాఖా మంత్రి ముస్తాఫా కమాల్ తాజాగా హెచ్చరించారు. పాక్ ప్రస్తుతం ఏటా సగటున 400 మిలియన్ డాలర్ల విలువైన టీకాలను గావీ అనే అంతర్జాతీయ కూటమి సహకారంతో

- మిగతా 2లో

# ఒబామా పై మరోసారి అక్కసు వెళ్లగక్కిన ట్రంప్

## 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాల పై ఆరోపణలు.

## సోషల్ మీడియాలో డీప్‌ఫేక్ వీడియో పోస్ట్.





అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్థాయిని మరిచి పోయి దిగజారిపో యారు. అత్యంత జుగుస్పాక రంగా అగ్రరాజ్యాధినేత వ్యవహరించారు. ఆయన తీరుతో మరోసారి తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు.

- మిగతా 2లో

# తెలంగాణ, మహారాష్ట్ర మధ్య నీటి గొడవలు లేవు



గోదావరి జలాల విషయంలో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఎలాంటి గొడవలు లేవన్నారు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాగజ్‌నగర్ లో జరిగిన సభలో పాల్గొన్న ఫడ్నవీస్.. గోదావరి జలాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా.. మేం నీళ్లు ఇవ్వడం వల్లే తెలంగాణ సస్యశ్యామలంగా ఉంది.

- మిగతా 2లో

# తులం బంగారం.. నెలకు రూ.2,500 వస్తున్నాయా?

- చెయ్యిచ్చిన పార్టీని నమ్మకండి
- ఆ హామీలు అమలైతే కాంగ్రెస్‌కు.. లేదంటే భారాసకు ఓటేయండి
- ఎన్నికల ప్రచారంలో కేటీఆర్

మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడం మినహా రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ నాయకులు చేసింది ఏమీ లేదని భారాస

- మిగతా 2లో





# వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం

- మధ్యంతర ఒడంబడికపై సంతకాలకు ఫ్రేమ్‌వర్క్ ఖరారు
- భారత్, అమెరికా సంయుక్త ప్రకటన
- మార్చిలో జరగనున్న సంతకాలు
- వెంటనే భారత్‌పై అదనపు సుంకాలను ఎత్తేసిన ట్రంప్
- మేక్ ఇన్ ఇండియా బలోపేతం: ప్రధాని

- మిగతా 2లో

# వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం

వాషింగ్టన్, న్యూయార్క్: మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి భారత్, అమెరికా శ్రీకారం చుట్టాయి. ఇందుకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేశాయి. ఈ విషయాన్ని శనివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో రెండు దేశాలు వెల్లడించాయి. తొలి దశలో కుదుర్చుకోనున్న ఈ ఒప్పందంపై మార్చిలో సంతకాలు జరగనున్నాయి. దీనివల్ల రెండు దేశాల మధ్య పలు ఉత్పత్తులపై సుంకాలు సున్నా స్థాయికిగానీ, గణనీయంగాగానీ తగ్గనున్నాయి. ఫ్రేమ్‌వర్క్‌పై సంయుక్త ప్రకటన వెలువడటానికి ముందు భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాలను ఎత్తివేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. ఈ నిర్ణయం మాత్రం శనివారం నుంచి అమల్లోకి వచ్చిందని శ్వేతసౌధం ప్రకటించింది. దీనికి ప్రతిగా రష్యా నుంచి ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ చమురును కొనుగోలు చేయబోమని భారత్ హామీ ఇచ్చిందని స్పష్టం చేసింది. మధ్యంతర ఒప్పంద ఫ్రేమ్‌వర్క్ ఖరారును ప్రధాని మోదీ స్వాగతించారు. దీనివల్ల మేక్ ఇన్ ఇండియా బలోపేతం అవుతుందని, యువత, మహిళలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

**భారీ ప్రయోజనం**

మధ్యంతర ఒప్పందం అమల్లోకి వస్తే భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులు, ఉత్పత్తులపై సుంకాలు సున్నా శాతం నుంచి 18 శాతం వరకూ అమలవుతాయి. ప్రస్తుతం అదనపు సుంకాలతో కలిసి 50శాతం ఉన్నాయి. శుక్రవారం 25శాతం అదనపు సుంకాలను ఎత్తి వేయడంతో 25 శాతానికి తగ్గాయి. అవి మరింత తగ్గనున్నాయి. కొన్నింటిపై సున్నా స్థాయికి చేరనున్నాయి. అమెరికా నుంచి భారత్‌కు వచ్చే ఉత్పత్తులపైనా సుంకాలు సున్నాగానీ, స్వల్పంగాగానీ ఉండనున్నాయి. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులు, ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులైన ఎండు ధాన్యాలు, పశువుల దాణాగా వాడే ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా, ప్రాసెస్డ్ పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్, ఆల్కహాల్‌పై సుంకాలు సున్నాగానీ, స్వల్పంగాగానీ ఉంటాయి.

భారత్, అమెరికా సంయుక్త ప్రకటన ప్రకారం.. రూ.45.29 లక్షల కోట్ల ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడి భాగాలు, విలువైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గు వంటి వాటిని దీర్ఘకాలంలో అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయనుంది.

**ప్రధాని ప్రశంస**

మధ్యంతర ఒప్పందం ఫ్రేమ్‌వర్క్ ఖరారు కావడంతో రైతులు, వ్యాపారులకు కొత్త అవకాశాలు లభిస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువతకు, మహిళలకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. భారత్‌తో బంధానికి కట్టుబడి ఉన్న ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. మధ్యంతర ఒప్పందం ఫ్రేమ్‌వర్క్ ఖరారుతో భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల వ్యాపారానికి ద్వారాలు తెరుచుకుంటాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలవారు, రైతులు, మత్స్యకారులు లబ్ధి పొందుతారని వివరించారు. గ్రామీణ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేలా.. పాలు, పాల ఉత్పత్తులు, చీజ్, మొక్కజొన్న, గోధుమ, బియ్యం, సోయా, కోళ్లు, ఇథనాల్ (ఇంధనం), పొగాకు, కొన్ని కూరగాయలు, మాంసం, గింజ ధాన్యాలు, జొన్నలు, సిరి ధాన్యాలు, రాగులు, తోటకూర, అరటి పండ్లు, స్ట్రాబెర్రీలు, చెర్రీలు, నిమ్మజాతి పండ్లపై సుంకాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఇంకా గ్రీన్ పీస్, కాబులీ శనగ, పెసర్లు, ఆయిల్ సీడ్స్, పశువుల దాణా, వేరుశనగ, తేనె, బార్లీ, వంటి ఉత్పత్తులు, ఆల్కహాల్ రహిత పానీయాలు, పిండి, గంజి, నిత్యావసర చమురులపైనా సుంకాలను భారత్ కొనసాగించనుంది.

**ఒప్పందంలోని ముఖ్యాంశాలు..**

తొలి దశలో భాగంగా భారత్ నుంచి ఎగుమతయ్యే రూ.3,98,536 కోట్ల ఉత్పత్తులపై సున్నా ప్రతీకార సుంకాలు అమలవుతాయి.

రూ.2,71,729 కోట్ల ఉత్పత్తులపై 18శాతం సుంకాలు అమలవుతాయి.

రూ.1,08,691 కోట్ల విలువైన ఉత్పత్తులపై ప్రస్తుత సుంకాలే అమలవుతాయి. వీటిలో ఉక్కు, రాగి, కొన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలున్నాయి. అన్ని దేశాలపైనా ఈ మూడింటిపై 50శాతం సుంకాలు అమలవుతున్నాయి. దీంతో వాటిలో మార్పులేదు.

**సుంకాలు తగ్గే భారత ఉత్పత్తులు..**

టెక్స్‌టైల్, అప్పారెల్, తోలు ఉత్పత్తులు, ప్లాస్టిక్‌లు, రబ్బర్, ఆర్గానిక్ కెమికల్స్, కళాకృతులు, పాదరక్షలు, ఆభరణాలు, యంత్ర విడి భాగాలు, బొమ్మలు, హోం డెకార్, స్మార్ట్ ఫోన్లు, వ్యవసాయ ఉత్పత్తులు.

రత్నాలు, వజ్రాలు, జనరిక్ ఔషధాలు, విమాన విడి భాగాలు, ఆటోమొబైల్ విడి భాగాలపై సున్నా సుంకాలు.

మసాలాలు, టీ, కాఫీ పౌడర్లు, కోప్రా, కొబ్బరి నూనె, పోక చెక్కలు, జీడి పప్పు, బ్రెజిల్ నట్, చెస్ట్‌నట్, అవకాడో, అరటి, జామ, మామిడి, కివీ, బొప్పాయి, పైనాపిల్, పుట్టగొడుగులు, కూరగాయల సాగు పరికరాలు, టారో, బార్లీ, కానరీ విత్తనాలు, బేకరీ, కొకోవా, కొకోవా ఉత్పత్తులు, నువ్వులు, గసగసాలు, పండ్ల జామ్‌లు.. పేస్ట్‌లు.

**అమెరికా ఉత్పత్తులు..**

డేటా సెంటర్లకు, ఏఐకి ఉపయోగపడే పరికరాలు, అత్యున్నత నాణ్యత కలిగిన చిప్‌లు, ఐసీటీ గూడ్స్, యంత్రాలు.

వైన్స్, ఆల్కహాల్ ఉత్పత్తులు, వాల్‌నట్స్, బాదం, పిస్తా, బీన్స్.

హైఎండ్ కార్లు, మోటారు సైకిళ్లు, విమానాలు.

గుండె, న్యూరో, డయాబెటిస్ సంబంధిత ఔషధాలు, కాస్మెటిక్స్, వైద్య పరికరాలు, ఎక్స్‌రే వాల్వులు, డయాగ్నస్టిక్ పరీక్షల్లో వాడేవి, పేస్ మేకర్లు, హియరింగ్ ఎయిడ్లు, కృత్రిమ జాయింట్లు, ఇమేజింగ్ ఉపకరణాలు.

# రాష్ట్రానికి సీఎం రేవంతా? నేనా?

- మొదటి పేజి తరువాయి

ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు భారాస, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది. అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగంలో రెండు పార్టీల మధ్య ఏమాత్రం తేడాలేదు. రాష్ట్రానికి కేసీఆర్, రేవంత్‌రెడ్డిలు సీఎంలుగా పనిచేయడం దురదృష్టకరం. నాడు కేసీఆర్ తన అసమర్థతను కేంద్రంపై నెట్టారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సైతం అదే పనిచేస్తున్నారు. సీఎం ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్టుగా మాట్లాడుతున్నారు. ఈ మధ్య హార్వర్డ్ వెళ్లొచ్చాక సీఎం భాష మరింత దిగజారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై అనేక ఆరోపణలు చేశారు. ఇప్పుడు కేసీఆర్ మీద ఈగ వాలకుండా కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి చర్యలు తీసుకోవడం లేదంటూ మా భుజాలపై బందూకులు పెట్టి బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారు. కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోకుండా రేవంత్‌రెడ్డిని ఎవరు ఆపుతున్నారు? రాహుల్‌గాంధీ ఆపుతున్నారా? మోదీని ఎదుర్కొనేందుకు కేసీఆర్, సోనియా కుటుంబాలు కుమ్మక్కయ్యాయి. రాహుల్‌గాంధీ ఆదేశాలన్నీ రేవంత్‌రెడ్డి పాటిస్తారు. మరి కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని రేవంత్‌ను రాహుల్‌గాంధీ ఎందుకు ఆదేశించడం లేదు? కాళేశ్వరం అవినీతి విషయంలో నన్ను ప్రశ్నించే నైతిక హక్కు రేవంత్‌రెడ్డికి లేదు. కేసీఆర్‌ను జైలుకు పంపిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు. అవన్నీ ఉత్తుత్తి మాటలే. మంత్రివర్గ సహచరులు వివిధ ప్రాజెక్టులు, కాంట్రాక్టుల విషయంలో కుమ్ములాటలకు దిగుతున్నారు. ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందినందునే సీఎం ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. అభివృద్ధి గురించి చెప్పాల్సిన సీఎం ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారు. నాడు భారాస సర్కారును, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వాన్ని అసదుద్దీన్ ఒవైసీ నడిపిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడింది. బీసీలున్న చోట ఎస్సీలకు, ఎస్సీలున్నచోట బీసీలకు, ఎస్టీలకు రిజర్వేషన్లు ఇచ్చి సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కింది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆ ల్యాబ్‌లో ఓటుకు నోటు కేసు, ఫోన్‌ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం ప్రకటన విడుదల చేయాలి" అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, అధికార ప్రతినిధి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్..

-మొదటిపేజీ తరువాయి

పలికారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్ లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగా సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11 వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. అభివృద్ధికి విశ్వసనీయ భాగస్వామిగా..ఇండియాను ఒక పెద్ద మార్కెట్ గానే గతంలో చూసేవారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయ మైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్‌ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు.

మలేసియాను ప్రపంచం లోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్-మలేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందరికీ తెలిసిందేనని అన్నారు. భారత్ కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. ఇండియా లోని పాపులర్ హిందీ గీతాలను అన్వర్ ఇబ్రహీం ఆలపిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయని, లెజెండ్రీ ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన బాగా ఇష్టపడతారని అన్నారు. దీనికి ముందు, భారత్‌కు చెందిన 800 మందికి పైగా నృత్యకారులు ప్రధానికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఎయిర్ పోర్ట్ నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం కలిసి ఒకే కారులో ప్రయాణించారు. భారత సంతతి ఆత్మీయ సమ్మేళనం వద్ద భారత్ మాతా కీ జై, 'మోదీ, మోదీ' అనే నినాదాలతో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

# భారత రైతులకు పూర్తి రక్షణ..

-మొదటిపేజీ తరువాయి

పూర్తి స్థాయి ఒప్పందం పై మార్చ్ లో భారత్, అమెరికా సంతకాలు చేస్తాయని తెలిపారు. ఆ తరువాత 30 ట్రిలియన్ డాలర్ల అమెరికా మార్కెట్ లోకి భారత ఎగుమతిదారులకు అవకాశం లభిస్తుందని వివరించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పై సుంకాలు తక్కువని తెలిపారు. ఇరు దేశాల మధ్య కుదిరిన ఉమ్మడి కార్యాచరణ ప్రకారం, భారత్ పై ప్రతీకార సుంకం 18 శాతానికి తగ్గిందని చెప్పారు. అదనంగా విధించిన 25 శాతం సుంకాన్ని కూడా అమెరికా ఉపసంహరించుకుందని చెప్పారు. మన ఉత్పత్తుల పై సుంకం 18 శాతం సుంకం అని, ఇది పొరుగు దేశాలతో పోలిస్తే మెరుగు అని తాజాగా నిర్వహించిన పత్రికా సమావేశంలో కేంద్ర మంత్రి తెలిపారు. చైనా వస్తువుల పై 35 శాతం, వియత్నాం, బంగ్లాదేశ్ వస్తువుల పై 20 శాతం, ఇండోనేషియా వస్తువుల పై 19 శాతం చొప్పున అమెరికా సుంకాలు విధిస్తోందని అన్నారు. భారత ఎగుమతిదారులు అనేక వస్తువులను ఎలాంటి సుంకాల బెడద లేకుండా అమెరికాకు ఎగుమతి చేయొచ్చని చెప్పారు. పలు వ్యవసాయ ఉత్పత్తుల పై కూడా ఎలాంటి సుంకాలు ఉండని చెప్పారు. మసాలాదినుసులు, టీ, కాఫీ, కొబ్బరి నూనె, జీడిపప్పు, పలు రకాల పండ్లు, కూరగాయాలను సుంకాల బెడద లేకుండా అమెరికాకు ఎగుమతి చేసుకోవచ్చని మంత్రి వివరించారు. భారత వ్యవసాయ రంగానికి రక్షణ కల్పించామని కూడా మంత్రి వివరించారు. విదేశీ ఉత్పత్తులకు భారత వ్యవసాయ రంగం తలుపులను పూర్తిగా తెరవలేదని భరోసా ఇచ్చారు. భారత దేశం స్వయం సమృద్ధి సాధించిన వ్యవసాయ ఉత్పత్తులను ట్రేడ్ డీల్ పరిధి లోకి తేలేదని వివరించారు. మాంసం, పౌల్ట్రీ, డెయిరీ, సోయాబీన్, మొక్కజొన్న, వరి, గోధుమలు, చక్కెర, జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలు వంటివి అమెరికా నుంచి తక్కువ టారిఫ్ లకు భారత్ లోకి అనుమతించబోమని చెప్పారు. గ్రీన్ టీ, కాబూలీ శనగలు, పల్లీలు, మాల్ట్, మాల్ట్ ఆధారిత ఉత్పత్తులకు కూడా ఈ ట్రేడ్ డీల్‌లో ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదని వివరించారు. భారత రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే కొందరు ఈ ట్రేడ్ డీల్‌ను చూసి ఆశ్చర్యపోతున్నారు అని వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ కామెంట్ చేశారు.

# భారత వ్యాక్సిన్లు లేక పాక్ విలవిల..

-మొదటిపేజీ తరువాయి

దిగుమతి చేసుకుంటోంది. ఈ ఖర్చులో 49 శాతం అంతర్జాతీయ సంస్థలు భరిస్తుండగా మిగిలిన డబ్బును పాక్ ప్రభుత్వం చెల్లిస్తోంది. పేదదేశాల్లో పిల్లలకు టీకాలు అందుబాటులో ఉండేందుకు గ్లోబల్ అలయెన్స్ ఫర్ వ్యాక్సిన్ అండ్ ఇమ్యునైజేషన్ (గావీ) కృషి చేస్తోంది. వివిధ దేశాల నుంచి తక్కువ ధరకు టీకాలను సేకరించి పేద దేశాలకు సరఫరా చేస్తుంటుంది. గావీకి పంపించే టీకాల్లో అధిక శాతం భారతీయ సంస్థల్లో తయారవుతుంటాయి. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు ఎన్ని ఉన్నప్పటికీ గావీ ద్వారా టీకాల సరఫరా చాలా కాలం పాటు కొనసాగింది. అయితే, గతేడాది ఇరు దేశాల ఉద్రిక్తతల పతాకస్థాయికి చేరుకున్నాక భారత్ నుంచి టీకాల సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం పాక్ ప్రభుత్వం తమ దేశ ప్రజలకు 13 రకాల టీకాలను ఉచితంగా అందిస్తోంది. ఇవన్నీ విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2031 కల్లా టీకా దిగుమతుల ఖర్చు 1.2 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని పాక్ మంత్రి హెచ్చరించారు. స్థానికంగా ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

## ఒబామా పై మరోసారి అక్కసు వెళ్లగక్కిన ట్రంప్

-మొదటిపేజీ తరువాయి

మాజీ అధ్యక్షుడు ఒబామా దంపతులను కించపరుస్తూ వారి ముఖాలకు కోతుల బాడీలను అతికించి వీడియో తన సోషల్ మీడియాలో ట్రంప్ పెట్టారు. దీని పై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలను ట్రంప్ అనుచరులు, రిపబ్లికన్లు ఖండించాలని కోరుతున్నారు. అయితే, గతం లోనూ ట్రంప్ ఇలాగే వ్యవహరించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఆయన సతీమణి మిషెల్లీ ఒబామాలను కోతులుగా చిత్రీకరిస్తూ రిపబ్లిక్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోస్ట్ చేసిన వీడియో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క నిమిషం నిడివి ఉన్న ఈ వీడియోను ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యం ట్రూత్ సోషల్ పోస్ట్ చేస్తూ మరోసారి 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాల పై ఆరోపణలు చేశారు. బ్యాలెట్ లెక్కింపు కంపెనీ డొమినియన్ ఓటింగ్ సిస్టమ్స్ 2020 ఎన్నికల్లో తన విజయాన్ని లాక్కోడానికి సహాయపడిందని ఆరోపించారు. వీడియో చివరలో ఒబామా దంపతులను కోతులుగా చిత్రీకరించారు. కోతుల శరీరాలకు మాజీ అధ్యక్ష దంపతుల ముఖాలను అతికించారు. బరాక్ ఒబామా, ఆయన భార్య మిషెల్లీ ఒబామా కనిపించే వీడియోకు బ్యాక్ గ్రౌండ్‌లో ది లైన్ స్లీప్స్ టు నైట్ అనే పాటను పెట్టారు. ఈ వీడియో పై కాలిఫోర్నియా గవర్నర్, ట్రంప్ పై తరుచూ విమర్శలు గుప్పించే గవిన్ న్యూసన్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. రిపబ్లిక్ నేత ప్రవర్తన అత్యంత అసహ్యకరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2028 అమెరికా ఎన్నికల్లో డెమొక్రాట్ల ప్రెసిడెంట్ అభ్యర్థిత్వం కోసం పోటీలో ఉన్నవారిలో గవిన్ ఒకరు. అధ్యక్షుడి ప్రవర్తన అత్యంత అసహ్యకర మైంది, ప్రతి రిపబ్లికన్ దీనిని ఖండించాలి అని ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. అమెరికా జాతీయ మాజీ భద్రతా సలహాదారు, ఒబామా సన్నిహితుడైన బెన్ రోడెస్ స్పందిస్తూ ట్రంప్ చరిత్రకు మాయని మచ్చలాంటివారని, అతడి అనుచరులు కూడా జాత్యహంకార అని కూడా ముద్ర వేశారని అన్నారు. భవిష్యత్ అమెరికన్లు ఒబామాను ప్రియ మైన వ్యక్తులుగా ఆలింగనం చేసుకుంటారని, అదే సమయంలో ఆయనను మన చరిత్ర పై ఒక మచ్చగా చూస్తారు. ట్రంప్, అతడి జాత్యహంకార అనుచరులను వెంటాడుతారు అని అన్నారు. అయితే, ట్రంప్ గతం లోనూ ప్రపంచ నాయకులను ఏఐ వీడియోల సాయంతో ఎగతాళి చేసిన సందర్భాలు ఉన్నాయి. గతేడాది కూడా ఒబామాను ఒవెల్ ఆఫీసులో అరెస్ట్ చేస్తున్నట్టు ఓ వీడియో రూపొందించారు. మరో నల్లజాతి నాయకుడు హకీమ్ జెఫ్రీస్ వ్యగ్యంగా చిత్రీకరించారు. అమెరికా చరిత్రలో ఏకైక నల్లజాతి అధ్యక్షుడిగా ఒబామా రికార్డులకు ఎక్కారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో కమలా హ్యారిస్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.

## గుర్తు పెట్టుకోండి.. తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సే

- మొదటి పేజి తరువాయి

**పెళ్లాం మొగుళ్ల మాటలు కూడా విన్నరు:**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ పేరుతో పెళ్లాంమొగుళ్ల మాటలు కుడా విన్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అనైతిక పనులు, తప్పులు చేస్తే నోటీసులు ఇవ్వకపోతే ఏం చేస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చరిత్ర దొంగ పాసుపోర్టులు, దొంగ నోట్లు అని.. ఆయన చరిత్ర తూడ్చినా పోదని అన్నారు. అలాంటి చరిత్రను నేనేందుకు తూడ్చుతానన్నారు. దళితలను సీఎం చేస్తానన్న మీ చరిత్రను నేనేలా తూడ్చుతానని.. కేసీఆర్ తెలంగాణ ద్రోహిగా మిగిలిపోతారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొఖం చెల్లకే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదని విమర్శించారు. రెండేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చాం. గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలంతా ఆలోచించి ఓటేయాలని సూచించారు.

## తెలంగాణ, మహారాష్ట్ర మధ్య నీటి గొడవలు లేవు

- మొదటి పేజి తరువాయి

మాకు నష్టం జరిగినా నీళ్లు ఇస్తున్నామన్నారు. అందరూ బాగుండాలనే సంకల్పంతో బీజేపీ ముందుకు సాగుతోంది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ప్రధానిమోదీ పాలనలో పట్టణాల అభివృద్ధికి కేంద్రం నేరుగా నిధులు మంజూరు చేస్తోందన్నారు ఫడ్నవీస్. స్మార్ట్, అమృత్ పథకాలతో పట్టణాలను అభివృద్ధి చేస్తోందన్నారు.పట్టణాల్లో రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి ప్రధాని అధికంగా నిధులు ఇస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు మహారాష్ట్ర సీఎం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ధనిక రాష్ట్రంగా ఉంది.. ఇప్పుడు అప్పుల పాలయ్యింది.. బీఆర్ ఎస్ ,కాంగ్రెస్ లు తెలంగాణను అప్పుల పాలు చేశాయన్నారు. పైసా లేకుండా రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారంటూ ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేసి అవినీతిపాలనతో అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నో కలలతో ఏర్పాటైన తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు ఫడ్నవీస్

## తులం బంగారం.. నెలకు రూ.2,500 వస్తున్నాయా?

- మొదటి పేజి తరువాయి

కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి భారాస నేతలపై నిందలు మోపుతూ రాష్ట్ర ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. శనివారం ఆయన కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి పట్టణాల్లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు చెయ్యి ఇచ్చిన పార్టీ, చెవిలో పూలు పెట్టే పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు.

**బాన్సువాడ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కేటీఆర్**

"420 అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఒక్కటైనా నెరవేర్చిందా? తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500, రైతుభరోసా, స్కూటీలు వచ్చాయా? ఇవి వచ్చిన వారు కాంగ్రెస్‌కు.. రాని వారు భారాసకు ఓటేయాలి. బతుకమ్మ చీరలు, మైనార్టీలకు తోఫాలు ఇవ్వని కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. మహిళలకు ఉచిత బస్సు పెట్టి పురుషులకు డబుల్ టికెట్ తీసుకుంటున్నారు. గతంలో రేవంత్‌రెడ్డి బాన్సువాడకు వచ్చి ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని దూషించారు. అయినా పోచారం అదే పార్టీలోకి వెళ్లారు. ఆయనకు భారాస హయాంలో మంత్రి, సభాపతి పదవులు ఇచ్చి గౌరవిస్తే... పార్టీ మారి కేసీఆర్‌ను, ఓటేసిన ప్రజలను మోసగించారు. ఆయన ఎందుకు కాంగ్రెస్‌లోకి వెళ్లారో? ఈ ప్రభుత్వంలో ఎన్ని నిధులు తీసుకొచ్చారో చెప్పాలి. ధైర్యం ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. ఉప ఎన్నికలో ప్రజలే వారి భవితవ్యం ఏంటో తేలుస్తారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్టీల్ బిందెలను పంపిణీ చేశారు. వాటిని చూసి మహిళలు ఓట్లు వేసి మోసపోయారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డికి హైదరాబాద్‌లో లంకెబిందెలు దొరుకుతున్నాయి" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎల్లారెడ్డి పోలీసులు అధికార పార్టీకి అండగా నిలుస్తున్నారని, తీరు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్‌షిండే, జాజాల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ పదవ తరగతి పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 07,**ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన మిషన్ పదవ తరగతి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి శనివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన "మిషన్ పదవ తరగతి" కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. చదువుతోనే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహాన్ని అందిస్తాయని అన్నారు.


మన జిల్లాలోని 111 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ. 2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా మొదటి స్థానాన్ని సాధించిన విద్యార్థికి రూ. 5 లక్షలు, రెండవ స్థానానికి రూ. 3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ. 2 లక్షలు, రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల టాపర్లకు రూ. 1 లక్ష చొప్పున, అలాగే 612 మండలాల టాపర్లకు రూ. 10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 2026 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో పాటు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సంస్థలు విద్యారంగానికి తోడ్పడటం అభినందనీయమని , విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఈడీఎం సైదేశ్వర రావు , శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులు శ్రీహరిరావు, మేనేజర్ ఉపేందర్, ఎగ్జిక్యూటివ్ జగదీష్, సంబంధిత సిబ్బంది, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక కర్షక ఐక్యతను చాటే సార్వత్రిక సమ్మె.....

- సిఐటియు జిల్లా నాయకులు ఎర్రం శెట్టి వెంకట్రామారావు.
- అధికారులకు సమ్మె నోటీసులు అందిస్తున్న స్కీం వర్కర్లు...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 07,**కార్మిక కర్షక హక్కులను ఏకకాలంలో కాలరాస్తున్న మోడీ సర్కార్ కి బుద్ధి చెప్పేందుకు ఈనెల 12వ తేదీన సార్వత్రిక సమ్మెతో కార్మిక కర్షక ఐక్యత తెలియబోతుందని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు ఎర్రం శెట్టి వెంకటరామారావు స్పష్టం చేశారు. 12 తారీఖున జరిగే సార్వత్రిక సమ్మె నేపథ్యంలో పలువురు అధికారులకు ఆశ అంగనవాడి మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నోటీసులను అందించారు. ఈ సందర్భంగా ఎర్రంశెట్టి వెంకట రామారావు మాట్లాడుతూ స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనం 26 వేల రూపాయలను అందించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు పనిచేసే చోట రక్షణ చేసే పనికి భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి మోడీ అధికారం చేపట్టినాక ఒక్కొక్కటిగా కార్మిక కర్షక హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి ఆ స్థానంలో నూతన పథకాన్ని తీసుకువస్తూ వ్యవసాయ కార్మికుల పొట్ట కొడుతున్నారని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తొలగించి కార్మిక కోడ్ పేరుతో హక్కులను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని స్థానాన 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చే కుట్రలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని 12 గంటల పని విధానం అమలు అయితే కార్మికులు కుటుంబాలకు సైతం పూర్తిగా దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అంతేకాకుండా యజమానిని ప్రశ్నించే యూనియన్లను రద్దు చేసే కుట్రలు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించాయని ఇటువంటి చర్యలతో కార్మికులకు ఏ కష్టం వచ్చినా అడిగి దిక్కే లేకుండా పోతుందని ఎర్రం శెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక కర్షక సమస్యల పరిష్కారం కోసం 12 తారీఖున జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు వ్యవసాయ కార్మికులు చిన్న సన్నకారు రైతులు సామాన్య ప్రజలు సైతం పాల్గొని మోడీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 12 తారీకు ఉదయం జరిగే కార్మిక మహా ప్రదర్శనలో ప్రతి కార్మికుడు యూనియన్ జండా బ్యానర్ తో ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి యూనియన్ నాయకులు లలిత నాగమణి శివకుమారి తదితరులు పాల్గొన్నారు

## పెంటాలవారిగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ రిపేర్ పనుల పరిశీలన...

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చిన్నమండవ సర్పంచ్ రాంచంద్రరావు పెంటాలవారిగూడెం ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్) రిపేర్ పనులను పరిశీలించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామంలో సుమారు 970 ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఒకప్పుడు కరువు సమస్యలు ఎదుర్కొన్న రైతులు ప్రస్తుతం రెండుపంటలు పండించుకుంటున్నారు. భూగర్భ జలాలు పెరిగి, ఎండాకాలంలో కూడా నీటి లభ్యత ఉండటంతో రైతులకు మేలు జరుగుతోంది.



# పెరటి కోళ్ల పెంపకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయం.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 07,**పెరటి కోళ్ల పెంపకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయ సమాకూరుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఎస్సీ కాలనీలో గ్రామీణ కుటుంబాల జీవనోపాధి స్థాయి మెరుగుదల లక్ష్యంగా నిర్వహించిన పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పెరటి కోళ్ల పెంపకం ద్వారా కుటుంబ అవసరాలకు సరిపడా ఆదాయం లభించడంతో పాటు పోషక విలువలు గల ఆహారం కూడా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. లబ్ధిదారులు కోళ్లను శ్రద్ధతో, సరైన సంరక్షణతో పెంచుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 50 యూనిట్లను గాను, 50 మంది మహిళా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 20 చొప్పున కోడి పిల్లలను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రతి లబ్ధిదారులకి 10 కిలోల కోళ్ల దాణా తో పాటు అవసరమైన ఫీడర్లు కూడా అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పెరటి కోళ్ల పెంపకంలో పాటించాల్సిన ప్రాథమిక అంశాలు, కోళ్లకు అందించాల్సిన ఆహారం, నివాస ఏర్పాట్లు, వ్యాధుల నివారణ, టీకాల నిర్వహణ తదితర అంశాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

ఎన్ఎంఆర్ఐ, హైదరాబాద్‌కు చెందిన సీనియర్ సైంటిస్ట్ డా. యోగేష్ దదేకర్ మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా కుటుంబ ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందని వివరించారు. ఐడీఓ గట్టుమల్ల డా. కపిల్ శర్మ పెరటి కోళ్ల పెంపకాన్ని దీర్ఘకాలిక జీవనోపాధిగా అభివృద్ధి చేసుకునే విధానాలపై విలువైన సూచనలు అందించారు.

ఈ కార్యక్రమంలో రామవరం పశు వైద్యులు డాక్టర్ ఆనందరావు, సంబంధిత శాఖల అధికారులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, గ్రామస్తులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన, హౌసింగ్ ఏ ఈ రియాజుద్దీన్



**ఫిబ్రవరి 08 ( సీ కే న్యూస్) చేగుంట /**చేగుంట మండల్ చందాయిపేట్ గ్రామంలో మండల హౌసింగ్ ఏ ఈ, రియాజుద్దీన్ శనివారం సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణలను పరిశీలించారు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణంలో వాడవలసిన ఇసుక,, కంకర, సిమెంట్, సలాక, ఏ పనిని ఎలా, కలిపి వాడాలనే దానిపై లబ్ధిదారులకు తెలియజేశారు, ప్రభుత్వ నిబంధన ప్రకారం పనులు జరుపుకుంటే బిల్లులువేనూ వెంటనే బిల్లులు రావడానికి తాను కృషి చేస్తానని లబ్ధిదారులకు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్,సెక్రటరీ కృష్ణ, కారోబార్ ఎల్లమేశ్వర్,లబ్ధిదారులు సాజీద్, తదితరులు పాల్గొన్నారు.

## సుపోషణతో ఆరోగ్యకర జీవనం జగన్నాధపురంలో అవగాహన కార్యక్రమం

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామ అంగన్వాడి కేంద్రంలో ఈరోజు సుపోషణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తాళ్లూరి స్వప్న ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పాలు, గుడ్లు, పిండి వంటి పోషకాహారాన్ని గర్భిణీ స్త్రీలు, బాలింతలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు ఆకుకూరలు మరియు పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి నెల అవసరమైన టీకాలు, ఇంజక్షన్లు తీసుకోవడం ద్వారా తల్లిశిశు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌వి రేచర్ల రాణి, ఏఎన్ఎం రజిని, వార్డు సభ్యులు తన్నీరు రమాదేవి, అంగన్వాడీ టీచర్ కాశీమల వెంకమ్మ, ఆశా వర్కర్ బందెల అరుణ, ఆయా యర్రమల పద్మతో పాటు గ్రామ ప్రజలు, చిన్నారులు పాల్గొన్నారు.



## బావి మరమ్మతులు చేపిస్తున్న సర్పంచ్ చాపల మడుగు వీరబాబు...



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలో గిరకి బావిలో చెట్ల కొమ్మలు, ఆకులు పడటం వల్ల నీరు కలుషితమై, పూడిక పేరుకుపోతుంది. తద్వారా నీటి నాణ్యత తగ్గి ప్రమాదకరంగా మారుతుంది. ఈ ఆకులు కుళ్లిపోయి నీటిలో ఆక్సిజన్ స్థాయిలను తగ్గిస్తాయి ఫలితంగా బావి దుర్వాసన వస్తుంది దీనిని నివారించడానికి, క్రమం తప్పకుండా పూడికతీత చేపట్టడం మరియు బావిపై రక్షణ జాలీ (నెట్) ఏర్పాటు చేయడం ఉత్తమం అని బావి అడుగున చేరిన కొమ్మలు, ఆకులు, బురదను తొలగించాలి నీటిని తోడేసి, సున్నం లేదా పొటాషియం పర్మాంగనేట్ వంటి క్రిమిసంహారకాలను ఉపయోగించి బావిని శుభ్రం చేయాలి బావి పైభాగంలో ఇనుప జాలీ లేదా పందిరిని ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో ఆకులు పడకుండా నివారణ చేయాలి బావిలోని నీటిని తిరిగి తాగడానికి లేదా ఇతర అవసరాలకు ఉపయోగకరంగా వాడుకోవాలని గ్రామ సర్పంచ్ గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ని కలిసిన కేతేపల్లి భాస్కరరావు ..

**తల్లాడ /ఫిబ్రవరి /7 సీకేన్యూస్ప్రతినిధివిజయ్:**తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు ఆర్యవైశ్య నాయకులు కేతేపల్లి భాస్కరరావు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ని వారి స్వగ్రామం లక్ష్మీపురంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు దివంగత మల్లు అనంత రాములు వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ని కలుసుకొని ఆయన తో ముచ్చటించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం తల్లాడ మండల రాజకీయ విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మేజర్ గ్రామపంచాయతీలు ఓడిపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అందుకు కేతేపల్లి వివరణ ఇస్తూ మండలంలో కాంగ్రెస్ పార్టీ సమన్వయ లోపంతో కొన్ని మేజర్ గ్రామపంచాయతీలు ఓడిపోవడం జరిగిందని అన్నారు. అనంతరం తల్లాడను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరారు. రింగురోడ్డు ఆధునీకరణ, సెంట్రల్ లైటింగ్,డివైడర్, జూనియర్ కాలేజీ, గవర్నమెంట్ హాస్పిటల్ ను ఆధునికరించి దయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని అదేవిధంగా హాస్పటల్లో 20 పడకలు ఏర్పాటు చేయాలని, 24 గంటలు వైద్య సదుపాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ని వారు కోరారు. అందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగలరని ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తెలంగాణ రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ , కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బొడ్డు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు .



## అంగరంగ వైభవంగా శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం.

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ కమిటీ చైర్మన్.
- పెద్ద ఎత్తున హాజరైన భక్తులు.













**సి.కే. న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఫిబ్రవరి 7.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ముద్దాపురం గ్రామంలో శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య అంగరంగ వైభవంగా జరిగింది పండితుల ఆశీర్వచనాలు సన్నాయి వాయిద్యాల నడుమ అర్చక బృందం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు కళ్యాణోత్సవానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి శ్రీ మత్స్యగిరిగుట్ట ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను ఆలయ కమిటీ చైర్మన్ వాకిటి కొండల్ రెడ్డి సమర్పించారు విగ్రహాల దాత సామ బాల్ రెడ్డి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు గోవింద నామ స్మరణతో ఆలయం మార్మోగింది వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం యూత్ సభ్యులు ఏర్పాటు చేసినారు.

అనంతరం కొడితాల అలివేలు అశోక్ గుప్తా దంపతులు కొణితల శ్రీకాంత్ నిమిషా దంపతులు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర నిర్వహించారు.

గ్రామ యువకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సామ సరస్వతి రాంరెడ్డి విగ్రహ దాత సామ బాల్ రెడ్డి మాజీ ఎంపీటీసీ సామ రాంరెడ్డి ఆలయ కమిటీ వైస్ చైర్మన్ సామ నర్సిరెడ్డి ధర్మకర్తలు వాకిటి గంగిరెడ్డి వాకిటి శ్రీనివాస్ రెడ్డి వాకిటి వెంకట్ రెడ్డి గుంటోజు యాదాచారి సామ నవీన్ రెడ్డి పిన్నింటి ధర్మారెడ్డి మాద సోమయ్య గౌడ్ ఆవుల అనిల్ యాదవ్ మీసాల కృష్ణ నాయకులు పులిపల్పుల రాములు గౌడ్ నరసింహ గ్రామ ప్రజలు యువకులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు

# నాకు ఒక్క అవకాశం కల్పిస్తే అంకితభావంతో పనిచేస్తా... కొండపల్లి సరిత





- ప్రచారంలో దూసుకుపోతున్న ఇల్లందు 23వ వార్డు మున్సిపాలిటీ కాంగ్రెస్ అభ్యర్థి
- బ్రహ్మరథం పడుతున్న ప్రజలు
- 23 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిని కొండపల్లి సరిత ప్రచారం..
- ఇంటింటి ప్రచారానికి భారీ స్పందన..
- గెలిస్తే అంకితభావంతో వార్డు ప్రగతి: కొండపల్లి

**సికె న్యూస్ ప్రతినిధి :**ఇల్లందు 24 ఏరియాలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న తనకు ఒక్క అవకాశం కల్పిస్తే అంకితభావంతో పనిచేసి వార్డును ప్రగతి వెలుగుల వైపు నడిపిస్తానని పట్టణంలోని 23 వ వార్డు అభ్యర్థిని కొండపల్లి సరిత అన్నారు. వార్డులో శనివారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేలు కోరం కనకయ్య మున్సిపాలిటీని వున్న పరిధిలోఎంతో అభివృద్ధి చేశారని ఆమె పేర్కొన్నారు. సిసి రోడ్లు, అంతర్గత కాలువల నిర్మాణం పెద్ద ఎత్తున జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో అభివృద్ధి చేయాలంటే తనకు అవకాశం కల్పించాలని ఆమె ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ ఉచిత కరెంటు, ఉచిత బస్సు లాంటి సదుపాయాలను మహిళలకు కల్పించిందని, పార్టీ చేసిన మంచి పనులు వార్డుల్లో తమను గెలిపిస్తాయని ఈ సందర్భంగా సరిత అన్నారు. ఈ 23 వార్డులో కాంగ్రెస్ పార్టీపై జోరుగా ప్రచారం సాగుతుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కార్యకర్తలు మహిళా కాంగ్రెస్ కార్యకర్తల తోపాటు తదితరులు పాల్గొన్నారు..





# ఏదులాపురంలో 'ప్రసాద్ రెడ్డి' ప్రచారం!

- వార్డుల్లో సుడిగాలి పర్యటన.. జనంతో మమేకం
- అండగా ఉంటాం.. అబివృద్ధి చేస్తాం : ప్రసాద్ రెడ్డి
- బ్రహ్మరథం పట్టిన జనం.. హోరెత్తిన ప్రచార ర్యాలీ

**సికె న్యూస్ ప్రతినిధి ఏదులాపురం :** మున్సిపల్ పోరులో కాంగ్రెస్ స్పీడ్ పెంచింది. శనివారం ఏదులాపురం పట్టణంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ నేత పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటనతో ఎన్నికల వాతావరణం ఫుల్ హీటెక్కింది. వార్డు వార్డుకూ తిరుగుతూ ఆయన చేసిన ప్రచారం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది.

జనం మధ్యలోకి.. సమస్యల దగ్గరకు..

ఉదయం శాబాదు నగర్ (28వ వార్డు), లిప్రసీ కాలనీ (30వ వార్డు) లలో ప్రసాద్ రెడ్డి పర్యటించారు. ప్రజలతో నేరుగా ముచ్చటించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

ర్యాలీతో దద్దరిల్లిన వీధులు

సాయంత్రం నాయుడుపేట (3వ వార్డు) నుంచి లక్ష్మి బృందావనం కాలనీ వరకు ర్యాలీ సాగింది. ఆదిత్య నగర్, కార్తికేయ టౌన్‌షిప్ మీదుగా సాగిన ఈ ర్యాలీకి జనం వెల్లువలా తరలివచ్చారు.

దారిపొడవునా మహిళలు హారతులతో ప్రసాద్ రెడ్డికి వెల్కమ్ చెప్పారు. కాంగ్రెస్ నినాదాలతో పట్టణ వీధులు మారుమోగాయి. ఏదులాపురం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చే బాధ్యత తనదని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ



నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా: కాంగ్రెస్ అభ్యర్థి కొండపల్లి సరిత



**సికె న్యూస్ ప్రతినిధి ఇల్లెందు, ఫిబ్రవరి 8:** ఇల్లెందు మున్సిపాలిటీ 23వ వార్డు కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కొండపల్లి సరిత తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. శనివారం ఇల్లెందు మున్సిపాలిటీ 23వ వార్డులోని పలు వీధుల్లో ఆమె కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్తూ 'చేయి' గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రచారం సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత పాలనలో 23వ వార్డు అనేక సమస్యలతో అల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు లో సరియైన డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షాకాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగిస్తానని హామీ ఇస్తూ ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణం మరియు వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.నేను మీ ఆడబిడ్డగా, మీ సమస్యలను తెలిసిన వ్యక్తిగా మీ ముందుకు వచ్చాను. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం. వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దే అవకాశం నాకు ఇవ్వండి. ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రజల వద్దకు వెళుతున్న తీరును.

ప్రజల నుంచి విశేష స్పందన

సరిత ప్రచారానికి వార్డు ప్రజల నుండి, ముఖ్యంగా మహిళల నుండి నీరాజనాలు అందుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలు, వార్డు అభివృద్ధిపై ఆమెకున్న విజన్ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ సెక్రెటరీ నవనితకు బుద్ధుడి ఫోటో బహూకరణ



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఫిబ్రవరి 7.** యాదాద్రి భువనగిరి జిల్లా మండలంలోని గోపరాజు పల్లి గ్రామానికి చెందిన జై భీమ్ సేన కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ నవనీత గోపరాజు పల్లి గ్రామం నుండి ట్రాన్స్ఫర్ అయిన సందర్భంగా జై భీమ్ సేన ఆధ్వర్యంలో క్యాలెండర్, బుద్ధుడు ఫోటో బహుకరించిన వలిగొండ మాల మహానాడు మండల సహాయ కార్యదర్శి కట్ట సురేష్. సమాజ సమానత్వం న్యాయం హక్కుల పరిరక్షణకు మార్గదర్శకుడైన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమని, గ్రామ అభివృద్ధిలో ఆయన బోధనలు మార్గదర్శకంగా నిలవాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి, జిల్లా నాయకులు రాపోలు పవన్ కుమార్, పాలకూర రాములు తదితరులు పాల్గొన్నారు

# తిమ్మినేనిపాలెం దండర్స్ యూత్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా క్రికెట్ పోటీలు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామంలోని 10 ఫిబ్రవరి2026 తేదీ నుండి క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించబడును ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతకాని ఎస్ఐ వీరేంద్ర కుమార్ పాల్గొంటున్నారు ఈ పోటీలో చింతకాని, ముదిగొండ, బోనకల్ మండలం వారు మాత్రమే ఈ పోటీలో పాల్గొనవలెను ఎంట్రీ ఫీజు 500 చెల్లించి 08 ఫిబ్రవరి2026 గడువు ఉన్నది గెలిచిన పోటీదారులకి మొదట బహుమతి15116 రెండో బహుమతి 13116 మూడో బహుమతి 10116 బహకరణ చేస్తారు ఈ కార్యక్రమానికి దాతలు తిమ్మినేనిపాలెం గ్రామ సర్పంచ్ కొమ్ము ప్రభు, చెరుకూరి నాగేశ్వరావు, చెరుకూరి వెంకటేశ్వర్లు, కూచిపూడి బుచ్చిబాబు, మడుపల్లి గోపాలరావు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుకుంటున్నారు

# భూగర్భ డ్రైనేజ్ పనుల పరిశీలన..

- అధికారులకు వేగవంతం చేయాలని సూచించిన కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్ సి కే న్యూస్** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ముదిరాజ్ కాలనీలో తొలిసారిగా చేపడుతున్న నూతన భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, సంబంధిత జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నాణ్యతను స్వయంగా పరిశీలించిన కార్పొరేటర్, నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు కాలనీలో భూగర్భ డ్రైనేజ్ సౌకర్యం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నూతన పైప్‌లైన్ ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తమ ప్రధాన బాధ్యత అని, డివిజన్‌లోని ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజగోపాల్, సూపర్‌వైజర్ బాలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల భద్రతపై కొల్లూరు పోలీసుల అవగాహన సదస్సు







**శేరిలింగంపల్లి, సి కే న్యూస్ :**నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికుల సంక్షేమం, భద్రతను దృష్టిలో ఉంచుకొని కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మైహోమ్ సాయుక్ క్లబ్ హౌస్ వద్ద ఈరోజు అవగాహన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ మాట్లాడుతూ.. నిర్మాణ ప్రాంగణాల్లో పనిచేసే కార్మికుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. నిర్మాణాల వద్ద నిర్దేశిత చట్టబద్ధమైన విధానాలు, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు. అలాగే కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, హక్కులపై వారికి వివరించారు.

కొల్లూరు ఎస్‌హెచ్‌ఓ గణేష్ పటేల్ మాట్లాడుతూ.. . ప్రతీ కార్మికుడికి సురక్షితమైన పని వాతావరణం కల్పించడం కాంట్రాక్టర్ల బాధ్యతన్నారు. కార్మికుల భద్రత, సంక్షేమానికి అన్ని విభాగాలు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ విషయంలో పోలీస్ శాఖ నుండి పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కొల్లూరు ఇన్ స్పెక్టర్ గణేష్ పటేల్, కొల్లూరు పోలీస్ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు, హెచ్‌ఆర్, సెక్యూరిటీ మేనేజర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. 500 మంది కార్మికులు హాజరయ్యారు.

# కొండవీడు ఉత్సవాల్లో సీబీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వందేమాతరం' చిత్ర ప్రదర్శనను ప్రారంభించిన కేంద్ర మంత్రి డా. పెమ్మసాని


**సి కే న్యూస్** పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని కొండవీడు ఉత్సవాల్లో భాగంగా "జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు" అనే అంశంపై కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి , నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు , చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు , రాష్ట్ర గ్రంథాలయ కమిషన్ చైర్మన్ కోటేశ్వరరావు , రాష్ట్ర శిల్పారామం చైర్‌పర్సన్ మంజులా రెడ్డి , పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా , ఇతర సీనియర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. కొండవీడు సామ్రాజ్య వైభవ చరిత్రను స్మరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండు రోజుల కొండవీడు ఉత్సవాల్లో భాగంగా, సీబీసీ "వందేమాతరం 150 సంవత్సరాలు" ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేసింది.



వందేమాతరం గీతం గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులు మరింత అవగాహన పెంపొందించుకోవాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పిలుపునిచ్చారు. యావత్ దేశాన్ని ఒక్కతాటిపై నిలిపి , ఐక్యతా భావాన్ని పెంపొందిస్తూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటాన్ని ఉద్ధృతం చేయాల్సిన సమయంలో, బంకిమ్ చంద్ర ఛటర్జీ "వందేమాతరం" రూపంలో అద్భుతమైన, ఆశాజనకమైన గీతాన్ని అందించారని పేర్కొన్నారు. వందేమాతరం గీతంలోని ప్రతి పదం నేటికీ ప్రేరణనిచ్చేదిగా , వికసిత్ భారత్ సాధనకు మార్గదర్శకంగా ఉందని తెలిపారు. సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. రమేశ్ చంద్ర మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో బంకిమ్ చంద్ర ఛటోపాధ్యాయ జీవితానికి సంబంధించిన అరుదైన , విశిష్ట చిత్రాలు , అలాగే వందేమాతరం జాతీయ గీతానికి సంబంధించిన చారిత్రక విశేషాలను ప్రదర్శించామని తెలిపారు. మొదటి రోజే వివిధ పాఠశాలలకు చెందిన వెయ్యికి పైగా విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించారని చెప్పారు. విద్యార్థుల కోసం తక్షణ వందేమాతరం క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామని ఆయన తెలిపారు.

# మహిమగల తల్లి కట్ట మైసమ్మ....







**కోరిన కోర్కెలు తీర్చి కొంగు బంగారమై నిలుస్తూ....**
**అమ్మవార్లు కొలువుదీరిన పుణ్య స్థలం ఇది....**
**డప్పు చప్పుళ్ళతో....ఘనమైన పూజలతో....:**
**యాపరిళ్లలు.... కళ్ళు శాకలతో...:**
**రంగం ఊరేగింపులు..... పోతారాజుల విన్యాసాలు...:**
**పండగ వాతావరణాన్ని తలపిస్తున్న సూరారం:**
**మొదలైన శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ-శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ జాతర:**

**కుత్బుల్లాపూర్ సి కే న్యూస్** కుత్బుల్లాపూర్:కొలిచిన వారికి కొంగు బంగారమై నిలిచి కొండంత అండగ వుండే తల్లి కట్టపైన వెలసి గ్రామ ప్రజలను కాపాడే సూరారం శ్రీ కట్ట మైసమ్మ తల్లి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర శనివారం అంగరంగ వైభవంగా మొదలైంది.సూరారం గ్రామ పెద్దలు, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి భావంతో అమ్మవార్ల కు మొక్కులు చెల్లించుకుంటారు.

ఘన చరిత్ర:కట్టపైన వెలసి గాలిదూళి నుండి గ్రామ ప్రజలను కాపాడే మహిమ గల్ల కట్టమైసమ్మ తల్లి ఆలయానికి విశేష చరిత్ర ఉందని చెప్పవచ్చు.1938లో సూరారం గ్రామం లింగం చెరువు కింద వున్న పొలం ఓ రైతు పొలం దున్నుతుండగా కట్ట మైసమ్మ తల్లి, సుబ్రహ్మణ్యశ్వర స్వామి, విగ్నేశ్వరుని విగ్రహాలు కనిపించగా గ్రామస్తులు కట్టపై చిన్న గుడి నిర్మించి భూతప్రేతాలనుండి తమను కాపాడేందుకు ఆ తల్లే స్వయంగా వెలసిందని నమ్మి తమ ఊరి ఇలవేల్పుగా కొలుస్తున్నారు.2004 నుండి ప్రతీ ఏటా ఫిబ్రవరి రెండో వారంలో శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి-శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర ఊరి ప్రజలంతా ఒక్కట్టే కన్నుల పండగలా నిర్వహిస్తుండగా జాతర ఏర్పాట్లు ఆలయ ప్రశస్తి గురించి సూరారం గ్రామ పెద్దలు,దేవాదాయ అధికారులు,ఆలయ అర్చకుల మాటల్లో....

మా ఊరిని కాపాడే తల్లి:శ్రీనివాస్ రెడ్డి, విశ్వకర్మ కాలనీ అధ్యక్షులు,సూరారం.:


మా ఊరి ఇలవేల్పు సూరారం కట్ట మైసమ్మ తల్లి. మా పూర్వికుల నుండి అనాదిగా గ్రామ ప్రజలం అంతా శ్రీ కట్టమైసమ్మ తల్లి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లులను భక్తితో కొలుస్తున్నాం.జాతర జరిగే రోజుల్లో ఈ ప్రాంతం పండగ వాతావరణాన్ని తలపిస్తుంది. కళ్యాణం, అమ్మవార్ల ఊరిగింపు,పోతారాజుల విన్యాసాలతో బోనాలు, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తాం.భక్తితో కొలిచే ప్రతీ ఒక్కరి కోర్కెలు తీర్చే మహిమగల తల్లి కట్ట మైసమ్మ.ప్రతీ ఏటా జాతర ఊరి ప్రజలం అందరం కలిసి కట్టుగా నిర్వహిస్తాం. భక్తి భావం తో కొలిచే ప్రతీ ఒక్కరిపై ఆ తల్లుల కృప ఉంటుంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసాం: కృష్ణమాచారి ఆలయ ఈఓ:సూరారం గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో అమ్మవార్ల జాతర ఏర్పాట్లు పూర్తి చేసాం.ప్రధాన రహదారిపై ఆలయం ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సూరారం పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.అదేవిదంగా జీహెచ్ఎంసి అధికారులతో సమన్వయం చేసుకుంటూ జాతర కన్నుల పండగలా నిర్వహించేలా ముందుకు సాగుతాం.ఈ నెల 07 నుండి 11 వ తేదీ వరకు జరిగే జాతరలో భక్త జనులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

అమ్మవారు కోరి కొలువుదీరిన ప్రాంతం:శాశంకాచార్యులు ఆలయ ప్రధాన అర్చకులు:చాలా ఏళ్ల కిందట అమ్మవారు స్వయంగా కొలువుదీరిన ప్రాంతం ఇది. సూర్య తేజస్సు నుదిటి తిలకమై, పున్నమి చంద్రుని కాంతుల వెలుగుల్లో అమ్మవారు దర్శనమిస్తారు.జాతర మొదటి రోజు 07 వ తేదిన సుప్రభాత సేవతో మొదలై పుణ్య వచనము, గణపతి పూజ, అంకురార్పణ, దిక్షా దారణ, అగ్ని ప్రతిష్ట, నవ వర్ణ జప హోమం,కళ్యాణం, అమ్మవార్ల ఊరేగింపు,08 నాడు అలంకరణ, శ్రీ చక్రార్చన, కుంకుమార్చన, ఒడి బియ్యం, మంగళ హారతి బోనాలు, మొక్కు బడులు, 09 నాడు రంగం, భవిష్యవాణి, భూతబలి, అశీర్వచనం, సాయంత్రం 05 గంటలకు పోతారాజుల ఊరేగింపు తో పలహారం బండి ఊరేగింపు, 11 నాడు మద్యాహ్నం 12 గంటలకు అన్నసమారాదన కార్యక్రమాలు ఉంటాయి.

భక్తి శ్రద్దలతో అమ్మవారికి మొక్కులు:సంతోష్, ఆలయ కమిటీ చైర్మెన్:

భక్తి భావంతో కొలిచేవారికి కొండంత అండగ ఉండి కోరిన కోర్కెలు తీర్చే అమ్మవార్లు కొలువుదిరిన ప్రాంతం సూరారం. లింగం చెరువు కట్టపై వున్న ఆలయంలో సూరారం గ్రామ ప్రజలంతా ఒక్క తాటిపై వుంటూ ప్రతీ ఏటా జాతర ఘనంగా నిర్వహిస్తాం.ఈ జాతర కు చుట్టూపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. అదేవిదంగా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు,స్థానిక నాయకులు అమ్మవార్లను దర్శించుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు.స్థానిక నాయకులం, ఆలయ కమిటీ ప్రతినిధులం అధికారులతో కలిసి జాతర ఏర్పాట్లు పర్యవేక్షిస్తాం.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త లు తీసుకుంటున్నాం.





# ఎస్‌బిఐ వినియోగదారులకు ఇక నుంచి ఛార్జీల మోతే!




దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఖాతాదారులకు షాకిచ్చింది. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా అందుబాటులో ఉన్న ఐఎంపీఎస్ (ఎఓఖూ) నగదు బదిలీ సేవలపై సర్వీస్ ఛార్జీలు వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ కొత్త నిబంధనలు 2026, ఫిబ్రవరి 15 నుంచి అమలులోకి రానున్నాయి. అయితే, సాధారణంగా అత్యవసర నగదు బదిలీల కోసం వినియోగించే ఎఓఖూ సేవలపై బ్యాంక్ పరిమితులను విధించింది. దీని ప్రకారం.. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ మరియు యోనో యాప్ ద్వారా చేసే లావాదేవీలకు ఈ ఛార్జీలు వర్తిస్తాయి. బ్యాంక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రూ. 25,000 వరకు ఎటువంటి ఛార్జీలు ఉండవు. రూ.25,001 నుంచి రూ.1,00,000 వరకు రూ.2 ప్లస్ జీఎస్‌టీ, రూ.1,00,001 నుంచి రూ. 2,00,000 వరకు రూ.6 ప్లస్ జీఎస్‌టీ, రూ.2,00,001 నుంచి రూ.5,00,000 వరకు రూ.10 ప్లస్ జీఎస్‌టీ చార్జ చయనున్నారు. కాగా, రూ.25 వేల లోపు చేసే లావాదేవీలపై ఎటువంటి ఛార్జీలు విధించకపోవడం సామాన్య వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగించే అంశం. నేరుగా బ్యాంకు బ్రాంచ్‌కు వెళ్లి చేసే ఎఓఖూ ఛార్జీలలో ఎటువంటి మార్పు లేదు. అవి పాత పద్ధతిలోనే రూ.2 నుంచి రూ.20 వరకు కొనసాగుతాయి. అదేవిధంగా డిఫెన్స్, కేంద్ర ప్రభుత్వం, రైల్వే, పోలీసు సిబ్బందికి చెందిన శాలరీ అకౌంట్లకు, అలాగే కొన్ని ప్రత్యేక సేవింగ్స్ ఖాతాలకు మాత్రం ఈ ఛార్జీల నుంచి మినహాయింపు ఉంటుంది.

# కిమ్స్ ఆదాయం రూ.1,003 కోట్లు

కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో తొలిసారిగా రూ.1,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించింది. సమీక్షా త్రైమాసిక ఆదాయం రూ.1,003 కోట్లుగా నమోదైంది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ.790 కోట్ల కంటే, ఇది 27% అధికం. ఇదే సమయంలో సంస్థ నికర లాభం మాత్రం రూ.93 కోట్ల నుంచి రూ.52 కోట్లకు పరిమితమైంది. కొత్తగా ప్రారంభించిన బెంగళూరు, థానే యూనిట్ల నిర్వహణ ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని సంస్థ వివరించింది. చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని, ఒక్కో పడక ద్వారా వచ్చే సగటు ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 20.5% వృద్ధితో రూ.46,341కి చేరుకుందని పేర్కొంది. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రల్లోని 25 ఆసుపత్రుల్లో సంస్థకు 7,100 పడకల సామర్థ్యం ఉంది. వివిధ దశల్లో ఉన్న కొత్త ఆసుపత్రుల ద్వారా, పడకల సామర్థ్యం 9,100కు చేరుతుందని కిమ్స్ సీఎండీ బి.భాస్కర రావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరాన్ని మరింత వృద్ధితో ముగిస్తామన్న విశ్వాసం ఉందన్నారు.

# ఆన్‌లైన్ మోసాల బాధితులకు రూ. 25,000 పరిహారం




ఈసారి ద్రవ్య పరపతి విధాన కమిటీసమావేశంలో ఆర్‌బీఐ కీలక ప్రతిపాదన చేసింది. చిన్న మొత్తంలో జరిగే మోసపూరిత లావాదేవీలలో నష్టపోయిన వినియోగదారులకు రూ. 25,000 వరకు పరిహారం అందించడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదిస్తుందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం తెలిపారు. వినియోగదారుల రక్షణ, డిజిటల్ చెల్లింపుల భద్రతను పెంచడానికి ఆర్‌బీఐ తీసుకున్న అనేక చర్యల్లో ఇది భాగం. దీనికి సంబంధించి మార్గదర్శకాలను త్వరలో జారీ చేస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. ఈ పరిహార ప్రయోజనం జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే వస్తుందని, ప్రతి సంవత్సరం కాదు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండటానికి, పదే పదే తప్పులు చేయకుండా నిలువరించడానికే ఈ పరిమితిని నిర్ణయించారు. చెల్లించాల్సిన మొత్తం నష్టంలో 85 శాతం లేదా రూ. 25,000, ఈ రెండింటిలో ఏది తక్కువ అయితే అదిగా లెక్కిస్తారు. ఉదాహరణకు నష్టం రూ. 50,000 అయితే, 85% అంటే రూ. 42,500 అవుతుంది. కానీ ఆర్‌బీఐ రూ. 25,000 మాత్రమే చెల్లిస్తుంది. అదే, నష్టం రూ. 20,000 అయితే, 85 శాతం అంటే రూ. 17,000, కాబట్టి పరిహారం రూ. 17,000 ఇస్తారు. ఆర్‌బీఐ డేటా ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 29,080 మోసాలు, రూ. 1,457 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. ఆ తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలో కార్డ్, ఇంటర్నెట్ ఆధారిత లావాదేవీలకు సంబంధించిన 13,469 మోసాల కేసులు నమోదయ్యాయని, వీటి వల్ల రూ. 520 కోట్ల నష్టం వాటిల్లిందని బ్యాంకులు నివేదించాయి. అలాగే, బ్యాంకులు కష్టమర్లకు అవసరంలేని, పూర్తి సమాచారం ఇవ్వకుండా రుణాలివ్వడం, రుణాల రికవరీ, అప్పులను వసూలు చేయడానికి ఏజెంట్ల వినియోగంపై మార్గదర్శకాలను జారీ చేస్తామని ఆర్‌బీఐ పేర్కొంది.

# పిఎఫ్‌సి చేతికి ఆర్ఇసి..

దేశీయ విద్యుత్ రంగ ఫైనాన్సింగ్ రంగంలో భారీ విలీనం చోటు చేసుకుంది. ప్రభుత్వ రంగ దిగ్గజం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఇసి)లో ప్రభుత్వానికి ఉన్న 52.63 శాతం వాటాను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఆర్ఎఫ్‌సి) కొనుగోలు చేసింది. దీనితో ఆర్ఇసి ఇప్పుడు పిఎఫ్‌సికి అనుబంధ సంస్థగా మారింది. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ కొనుగోలుకు ఆమోదం తెలపడమే కాకుండా, భవిష్యత్తులో ఈ రెండు సంస్థల పూర్తిస్థాయి విలీనానికి కూడా సూత్రప్రాయంగా అంగీకారం లభించింది. రెండు సంస్థల విలీనం ద్వారా రుణ పంపిణీ సామర్థ్యం పెరిగి, గ్రీన్ హైడ్రోజన్, ఇవి బ్యాటరీ స్టోరేజ్, మెట్రో రైలు వంటి భారీ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం మరింత సులభతరం కానుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయంతో కేంద్రానికి భారీ ఆదాయం సమకూరనుంది. ఇది ఒక రకంగా పెట్టుబడుల ఉపసంహరణే కావడం గమనార్హం. మరోవైపు దీనిపై ఇరు సంస్థల ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విలీనం ద్వారా విద్యుత్ ఫైనాన్స్ రంగంలో పోటీతత్వం లోపించే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఉద్యోగాలు తగ్గుతాయని హెచ్చరిస్తున్నారు.

# భారత ఎగుమతిదారులు, ఎంఎస్ఎంఇ రంగానికి సువర్ణావకాశం




భారత్ అమెరికా దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందానికి సంబంధించిన అధికారిక ముసాయిదా విడుదలైంది. దీంతో ఇరు దేశాల నేతలు ఈ చారిత్రక ఒప్పందం పై హర్షం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రకటనలు విడుదల చేస్తున్నారు.అయితే ఈ ఒప్పందం వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే క్లారిటీ ఇప్పుడిప్పుడే వస్తుంది. భారత్, అమెరికాల ఒప్పందం కారణంగా.. భారతీయ ఎగుమతిదారులకు సుమారు 30 ట్రిలియన్ డాలర్ల అమెరికా మార్కెట్ అందుబాటులోకి రానున్నట్లు మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఇందులో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవస్థాపకులు మరియు స్టార్టప్ ఆవిష్కర్తలు తమ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయడానికి భారీ అవకాశాలు లభిస్తాయి. అమెరికా తన దిగుమతి సుంకాలను 18 శాతానికి తగ్గించడం వల్ల టెక్స్‌టైల్స్, లెదర్, ఫుట్‌వేర్, ప్లాస్టిక్, హ్యాండీక్రాఫ్ట్స్ వంటి రంగాలకు చెందిన తయారీదారులు అంతర్జాతీయ విపణిలో గొప్ప లాభాలను పొందే అవకాశం ఉంది. తాజా పరిణామాలతో ఎవరికి లాభం ఎవరికి నష్టం అనే విషయాలను ఇక్కడ చూద్దాం. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం కేవలం ఆర్థిక వృద్ధికే పరిమితం కాకుండా, దేశంలో లక్షలాది కొత్త ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమం చేస్తుంది. ఎగుమతులు పెరగడం వల్ల తయారీ, సేవా రంగాల్లో నూతన అవకాశాలు లభిస్తాయి, ఇవి ప్రధానంగా యువత, మహిళా కార్మికులకు ఎంతో మేలు చేస్తాయి. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పెరిగి, మధ్యతరగతి, గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని అంచనా వేయబడింది. ఈ ఒప్పందం కారణంగా భారత్ రైతులు, వ్యవసాయ రంగానికి నష్టం కలిగే అవకాశం ఉందని మొదట అనే విమర్శలు వచ్చాయి. అయితే దేశీయ వ్యవసాయ రంగంపై ప్రభావం చూపకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. భారత్ తన రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, సున్నితమైన వ్యవసాయ, పాడి ఉత్పత్తులైన వరి, గోధుమ, మొక్కజొన్న, పాలు, చీజ్, పౌల్ట్రీ వంటి వాటిని ఈ ఒప్పందం పరిధిలోకి రాకుండా పూర్తి రక్షణ కల్పించింది. దీనివల్ల అమెరికా నుంచి వచ్చే చౌకైన అగ్రి-ఉత్పత్తుల వల్ల మన రైతులు నష్టపోయే ప్రమాదం లేకుండా ప్రభుత్వం జాగ్రత్త పడింది. ఈ ఒప్పందం కారణంగా అమెరికా నుంచి అనే వస్తువులు భారత్‌లోకి దిగుమతి అవుతాయి. దీంతో భారతీయ కంపెనీలు అమెరికా నుంచి వచ్చే నాణ్యమైన ఉత్పత్తులతో పోటీ పడాల్సి ఉంటుంది. అమెరికా కూడా పరస్పర ప్రాతిపదికన కొన్ని రాయితీలను పొందుతుంది కాబట్టి, మన దేశీయ మార్కెట్లోకి వచ్చే అమెరికా వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. ఇది భారతీయ వినియోగదారులకు లాభం చేకూర్చినప్పటికీ, దేశీయ తయారీదారులు తమ నాణ్యతను పెంచుకుని పోటీని పెట్టుకోవాల్సిన సవాలును ఎదుర్కొంటారు. ముఖ్యంగా విమాన విడిభాగాలు, జెనరిక్ ఫార్మా రంగాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగు పడాల్సి ఉంటుంది.

# ఏఐ వెల్‌నెస్ కోచ్‌లతో మారనున్న మీ లైఫ్ స్టైల్




నేటి సమాజం పెరుగుతున్న టెక్నాలజీతో ఎంత వేగంగా మారుతుందో చెప్పడానికి మన చేతుల్లో ఉండే స్మార్ట్ పరికరాలో ప్రధాన ఉదాహరణ. ఒకప్పుడు కేవలం ఫోన్ కాల్స్, మెసేజ్‌లకే పరిమితమైన స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇప్పుడు మన ప్రాణాలను కాపాడే 'లైఫ్ గార్డ్స్'గా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఆరోగ్యంగా ఉండటానికి.. మనం ఏం తినాలి? ఎంతసేపు పడుకోవాలి? చివరికి మనం ఎప్పుడు నీళు తాగాలో కూడా ఇప్పుడు ఒక 'చిప్', 'ఏఐ అల్గారిథం' నిర్ణయిస్తుంది. 2026లో లైఫ్ స్టైల్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న "ఏఐ వెల్‌నెస్ కోచింగ్" గురించి ఇక్కడ తెలుసుకుందాం. పాత కాలంలో మనకు ఆరోగ్యం బాలేకపోతే డాక్టరు దగ్గరికో, ఫిట్‌నెస్ కోసం యోగా గురువు, జిమ్ ట్రైనర్ దగ్గరికో వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ అవసరం లేకుండానే మన చేతికి ఉన్న స్మార్ట్ రింగ్, స్మార్ట్ వాచ్ మన శరీరంలోని ప్రతి కదలికలను గమనిస్తోంది. ఇవి కేవలం అడుగులను లెక్కించడమే కాకుండా, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను, గుండె వేగంలోని హెచ్చుతగ్గులను, నిద్ర నాణ్యతను సెకన్ల వ్యవధిలో విశ్లేషిస్తున్నాయి. ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి, మన శరీర తత్వానికి తగ్గట్టుగా పర్సనలైజ్డ్ సూచనలను అందిస్తున్నాయి. అభివృద్ధి తో పోటీ పడుతున్న ఈ సమయంలో మనం తీసుకునే ఆహారం, మనపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి శరీర మెటబాలిజం ఒకేలా ఉండదు. అందుకే అందరికీ ఒకే రకమైన డైట్ ప్లాన్ పని చేయదు. ఏఐ కోచ్‌లు మీ శరీరంలోని షుగర్ లెవల్స్, క్యాలరీ బర్నింగ్ రేటును బట్టి, మీకు ఆ రోజు ఏ ఆహారం అవసరమో సూచిస్తాయి. ఉదాహరణకు, మీరు వ్యాయామం చేసిన తర్వాత ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోమని, రక్తంలో షుగర్ పెరిగితే కార్బోహైడ్రేట్లు తగ్గించమని ఇవి మనకు సలహాలు అందిస్తాయి. పోటీ ప్రపంచంలో పని ఒత్తిడి, ఆర్థిక, కుటుంబ కారణాల వల్ల ఎంతో మంది మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది నేటి తరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య గా మిగిలిపోయింది. మీరు ఎప్పుడు ఆందోళనకు గురవుతున్నారో మీ నాడి వేగాన్ని బట్టి ఏఐ గుర్తిస్తుంది. వెంటనే మీ ఫోన్‌లో ఒక చిన్న మెడిటేషన్ సెషన్, ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే ఎక్సర్‌సైజ్ చేయమని రిమైండర్లు పంపుతుంది. తద్వారా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి కాకముందే మిమ్మల్ని అలర్ట్ ఇది చేస్తుంది.

# విద్యారంగానికి జాకీర్ హుస్సేన్ విశిష్ఠ సేవలు

భారత దేశపు మొదటి ముస్లిం రాష్ట్రపతి, పదవిలో మరణించిన మొదటి భారత దేశ ప్రథమ పౌరులు జాకీర్ హుస్సేన్ (ఫిబ్రవరి 8, 1897 – మే 3, 1969). ఆయన మే 13 1967 నుండి మరణించినంత వరకు రాష్ట్రపతి పదవిలో ఉన్నారు. భారత 3వ రాష్ట్రపతి జాకీర్ హుసేన్ హైదరాబాదు (భారత దేశం)లో జన్మించారు. ఇతని తండ్రి పఖ్తూన్ జాతికి చెందిన వారు. అయన హైదరాబాదు నుండి ఉత్తరప్రదేశ్ లోని ఫరూఖాబాద్ జిల్లా ఖాయిమ్ గంజ్ కు వలస వచ్చారు. హుస్సేన్ ప్రారంభ ప్రాథమిక విద్య హైదరాబాద్‌లో పూర్తయింది. హుసేన్ ఇటావా (ఉత్తరప్రదేశ్) లోని 'ఇస్లామియా ఉన్నత పాఠశాల' లో చదువు కున్నారు. లక్నో విశ్వ విద్యాలయం క్రిస్టియన్ డిగ్రీ కాలేజీ నుండి ఎకనామిక్స్ లో పట్టభద్రు దయ్యారు. ఉన్నతవిద్య అలీఘర్ లోని ఆంగ్లో మహమ్మడన్ ఓరియంటల్ కాలేజిలో అభ్యసించారు. ఇచట విద్యార్థి సంఘ నాయకునిగా గుర్తింప బడ్డారు.18 సంవత్సరాల వయస్సులో, అయన షాజహాన్ బేగంను వివాహం చేసుకున్నారు. జాకీర్ హుస్సేన్ 23 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందంతో అయన నేషనల్ ముస్లిం విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు. మొదట అలీఘర్లో 1920 అక్టోబర్ 29 శుక్రవారం స్థాపించ బడింది, తరువాత 1925 లో న్యూ ఢిల్లీ లోని కరోల్ బాగ్ కు మార్చబడింది. తరువాత మార్చి 1, 1935 న న్యూ ఢిల్లీలోని జామియా నగర్ కు మళ్లీ మార్చ బడింది. దీనికి జామియా మిలియా ఇస్లామియా (కేంద్ర విశ్వ విద్యాలయం) అని పేరు పెట్టారు.జాకీర్ విత్తశాస్త్రంలో పి.హెచ్.డి. చేసేందుకు, 'బెర్లిన్ విశ్వ విద్యాలయానికి (జర్మనీ) వెళ్ళారు.1926 లో బెర్లిన్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. జర్మనీలో ఉన్నప్పుడు గాలిబ్ (1797–1868) జీవితగాథ, కవితా సంగ్రహాలను క్రోడీకరించారు.1927 లో మూసివేతను ఎదుర్కొంటున్న జామియా మిలియా ఇస్లామియాకు నాయకత్వం వహించడానికి అతను భారత దేశానికి తిరిగి వచ్చాడు. భారత దేశానికి తిరిగి వచ్చి, జామియా మిల్లియా ఇస్లామియాకు ఇరవై ఒక్క సంవత్సరాలు ఆయన పదవిలో కొనసాగారు. మార్గ దర్శకులుగా మారారు. ముహమ్మద్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాల (ఇప్పుడు అలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం) వ్యవహారాల్లో ముఖ్యంగా చురుకుగా ఉన్నారు. మహమ్మద్ అలీ జిన్నా వంటి రాజకీయ ప్రత్యర్థుల ప్రశంసలను పొందారు. బ్రిటిష్ వారితో పోరాటానికి, మహాత్మా గాంధీతో చేతులు కలిపి, "బేసిక్ విద్య" పై కఠోర పరిశ్రమ చేశారు. భారతదేశంలో విద్యాభ్యుదయానికి శ్రమించారు. ఈ కాలంలో హుసేన్ ఉత్తమ దార్శనికుడిగా, భారత విద్యా విభాగ మార్గదర్శకునిగా గుర్తింపు పొందారు. తమ రాజకీయ ప్రత్యర్థియైన మహమ్మద్ అలీ జిన్నా చేత కూడా పొగడ బడ్డారు. తన వ్యక్తిగత సంపదనంతా భారతదేశానికి ధారబోసిన దేశ భక్తులు. భారత స్వాతంత్ర్యం తరువాత, అలీఘర్ ముస్లిం యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ పదవిని అంగీకరించారు. స్వాతంత్ర్యం వచ్చిన ప్రథమ దశలో విద్యార్థుల ఉద్యమాలను, ముఖ్యంగా అలీఘర్ లో, అదుపులో ఉంచుటకు, అయన నియామకం ఎంతో ఉపయోగ పడింది. వైస్ ఛాన్సలర్ పదవీకాలం ముగిసిన తరువాత 1956 లో పార్లమెంటు సభ్యునిగా నామినేట్ చేయ బడ్డారు. 1957 లో బీహారు గవర్నరుగా నియమింప బడి, పార్లమెంటుకు రాజీనామా చేశారు. బీహారు గవర్నరుగా 1957 నుండి 1962 వరకు సేవలందించిన తరువాత 1962 నుండి 1967 వరకు భారత ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించారు. తదనంతరం మే 13 1967 న భారత రాష్ట్రపతిగా ఎన్నుకో బడ్డారు. అయన ప్రథమ ఉపన్యాసంలో "మొత్తం భారత దేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం" అని పేర్కొన్నారు. తన అధ్యక్ష పదవీ కాలంలో, హుస్సేన్ హంగరీ, యుగోస్లేవియా, యుఎస్ఎస్ఆర్ మరియు నేపాల్ లకు నాలుగు దేశాలకు పర్యటించారు.1969 మే 3 న అయన మరణించగా, న్యూ ఢిల్లీ లోని జామియా మిలియా ఇస్లామియా క్యాంపస్‌లో ఖననం చేశారు. అత్యల్పకాలం రాష్ట్రపతి పదవి నిర్వహించిన మొదటి వ్యక్తి. రాష్ట్రపతి పదవిలో ఉండగా మరణించిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. (ఇప్పటి వరకు ఇద్దరు రాష్ట్రపతులు పదవిలో ఉండగా మరణించారు – డా.జాకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ). ఈయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1963 లో 'భారతరత్న' పురస్కారాన్ని అందించింది.

# ఎక్సర్‌సైజ్ చేసినా బెల్లీ ఫ్యాట్ తగ్గట్లేదా



బెల్లీ ఫ్యాట్ చూడ్డానికి చిన్న ప్రాబ్లమ్‌లానే కనిపించే పెద్ద ప్రాబ్లమ్. దీనిని తగ్గించుకునేందుకు ఎక్కువగా ఎక్సర్‌సైజెస్, డైట్స్, ఇంటి చిట్కాలు ఫాలో అవుతుంటారు. అయినప్పటికీ త్వరగా రిజల్ట్ కనిపించదు. దీంతో నా బాడీ టైప్ ఇంత అని సరిపెట్టేసుకుంటారు. కానీ, అలా కాకుండా అసలు ఏం మిస్టేక్స్ చేస్తున్నామో గమనించాలి. ఎంత ట్రై చేసినా పొట్ట తగ్గట్లేదంటే కొన్ని తప్పులే కారణమని చెబుతున్నారు హోమియోపతి డాక్టర్ చందన. ఆమె ప్రకారం కొన్ని తప్పుల్ని అవాయిడ్ చేస్తే చాలా వరకూ బెల్లీ ఫ్యాట్ తగ్గుతారట. మరి తప్పులేంటో చూడండి. బెల్లీ తగ్గాలంటే తినడం తగ్గించాలనుకోవడం సరికాదు. ముఖ్యంగా, రోజులో ముఖ్యమైన మీల్ బ్రేక్‌ఫాస్ట్‌ని అసలే స్కిప్ చేయొద్దు. ఇది ఎందుకు ముఖ్యమైన మీల్ అంటే రాత్రంతా దాదాపు 8 నుంచి 10 గంటల పాటు ఫాస్టింగ్ ఉన్న కడుపుకి బ్రేక్‌ఫాస్ట్ అనేది ఎనర్జీని ఇస్తుంది. దీనిని స్కిప్ చేసినా, లేట్‌గా చేసినా కూడా బెల్లీ తగ్గదు. తనలోని ఫ్యాట్‌ని అలానే ఉంచేస్తుంది. పైగా నీరసం, కోరికలు పెరిగి ఇంకా ఎక్కువగా తినాలనుకుంటారు. ఈ కారణం చేత లంచ్ టైమ్‌లోపు ఎక్కువగా జంక్‌ఫుడ్ తింటారు. అలా కాకుండా, చక్కగా ఉదయాన్నే మంచి హెల్దీ ముఖ్యంగా ప్రోటీన్ రిచ్ బ్రేక్‌ఫాస్ట్ చేయండి. దీంతో చాలా వరకూ బాడీలోని ఫ్యాట్ కరుగుతుంది.

నీరు మంచిదే. కానీ, ఎప్పుడు తాగాలనేది తెలుసుకోవాలి. నీటిని మనం తినడానికి అరగంట ముందైనా, తర్వాతైనా తాగాలి. అంతేకానీ, తాగిన వెంటనే తినడం, తిన్న వెంటనే నీటిని తాగడం వంటివి చేయొద్దు. దీంతో జీర్ణ సమస్యలొస్తాయి. ఈ సమస్యలు ఉంటే ఆటోమేటిగ్గా గట్ ప్రాబ్లమ్స్ పెరిగి పొట్ట కూడా లావుగా కనిపిస్తుంది. కాబట్టి, అలా కాకుండా తిన్న తర్వాత గ్యాప్ ఇచ్చి నీటిని తీసుకోండి. కొంతమంది రోజంతా ఏదో ఒక ఫుడ్ తింటూనే ఉంటారు. అవి స్నాక్స్ అయినా, మరే ఫుడ్ అయినా అలా నోటిని ఆడిస్తూనే ఉంటారు. దీని వల్ల మీ గట్‌కి గ్యాప్ ఎక్కడ దొరుకుతుంది. ఎప్పుడైనా సరే కాసేపు కడుపుకి రెస్ట్ ఇవ్వండి. దీంతో చాలా వరకూ తిన్న ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. హెల్దీగా ఉంటారు. అలా ఏది పడితే అది తినకుండా ఉండండి. బరువు, బెల్లీ తగ్గాలనుకున్నా, జీర్ణ సమస్యలు దూరమై గట్ హెల్త్ బాగుండాలన్నా, మంచి నిద్ర పట్టాలన్నా కూడా డిన్నర్‌ని ఎంత త్వరగా చేస్తే అంత మంచిది. అలా కాకుండా రాత్రుళ్లు లేట్ అయ్యే కొద్దీ మనకి మనంగానే ప్రాబ్లమ్స్‌ని తెచ్చుకున్నవారవుతాం. కాబట్టి, లేట్ నైట్ డిన్నర్ కాకుండా కనీసం 8 గంటల్లోపైనా డిన్నర్ కంప్లీట్ అవ్వాలి. తినడానికి నిద్రపోవడానికి కనీసం గంటన్నర నుంచి 2 గంటల గ్యాప్ ఉండేలా చూసుకోండి. అదే విధంగా, నిద్ర కూడా చాలా ముఖ్యం. రోజంతా అలసిన శరీరానికి, మనసుకి నిద్ర అనేది మంచి రిలాక్సేషన్ లాంటిది. మంచి నిద్ర ఉంటే బాడీ అలసిపోదు. మనసు కూడా తేలిగ్గా ఉంటుంది. కాబట్టి, హ్యాపీగా నిద్రపోండి. మంచి నిద్ర అంటే గ్యాప్ లేకుండా కనీసం 7 గంటలైనా నిద్రపోవడం. ఆల్కహాల్ అలవాటు అకేషనల్లీ అయితే పర్లేదు. కానీ, రెగ్యులర్‌గా ఆల్కహాల్ తీసుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది కాదు. దీని వల్ల జీర్ణ సమస్యల దగ్గర్నుంచీ ఇతర సమస్యలు కూడా వస్తాయి. డీహైడ్రేట్ అవుతారు. నిద్ర సమస్యలొస్తాయి. ఇది మన శరీర పనితీరుని నెమ్మదిస్తుంది. కాబట్టి, ఎప్పుడు కూడా అలా చేయకండి. ఏదైనా పార్టీ ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవడం మంచిది. ఇలాంటి తప్పులన్నీ అవాయిడ్ చేసి మంచి డైట్, లైఫ్‌స్టైల్ ఫాలో అయితే చాలా వరకూ బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. అంతేకానీ, నా శరీరమే ఇంత కాస్త తిన్నా బాడీ పెరుగుతుందనుకుని మిమ్మల్ని మీరు మభ్యపెట్టుకోవద్దు.

# పరీక్షలపై చర్చలో మోదీ విలక్షణ మార్గదర్శనం

దేశవ్యాప్తంగా ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లితండ్రులు ఎదురు చూస్తున్న వార్షిక కార్యక్రమంగా ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించే "పరీక్షా పే చర్చా లేదా పిపిసి (పరీక్షలపై చర్చ)" వేదిక అందరి మన్ననలు పొందుతున్నది. యువభారత రేపటి పౌరుల సక్రమ నిర్మాణానికి, రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఈ కార్యక్రమం ఉత్ప్రేరకంగా పని చేస్తున్నది. దేశవ్యాప్తంగా 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు పాల్గొంటున్న "పరీక్షా పే చర్చా" 2018 ఫిబ్రవరి 16న ప్రారంభమైంది. 10 ఫిబ్రవరి 2025 రోజు నిర్వహించిన 8వ విడత పరీక్షా పే చర్చా కార్యక్రమంలో 3.53 కోట్ల మంది యువత పాల్గొని అత్యధిక ఆన్‌లైన్ నమోదు పొంది 'గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు సాధించింది. 06 ఫిబ్రవరి 2026 ఉదయం 10 గంటలకు దేశ ప్రధానమంత్రి నిర్వహించిన 9వ విడత 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో 4.5 కోట్ల విద్యార్థులు, 24.8 లక్షల ఉపాధ్యాయులు, 6.15 లక్షల తల్లితండ్రులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. కోయంబత్తూర్, ఛత్తీస్‌గఢ్, రాయ్‌పూర్, దేవ్ మోగ్రా, గువాహటీల నుంచి ఈ కార్యక్రమం ఆన్‌లైన్‌లో నిర్వహించడం, అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు నేరుగా చూడగలగడం, ప్రేరణ పొందడం జరుగుతోంది. రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి సంబంధించిన పలు అంశాలను మోదీ వాక్కుల రూపంలో ఈ వేదిక వివరిస్తున్నది. మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రచించిన "ఎగ్జాం వారియర్స్" అనే పుస్తకం ప్రేరణగా ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది. 06 ఫిబ్రవరి 2026న నిర్వహించిన కార్యక్రమంలో పరీక్షల సమయంలో విద్యార్థులు ఎదుర్కొనే అర్థం లేని భయాలు, అనవసర ఒత్తిడి, అసంబద్ధ అనుమానాలు లాంటి అంశాల పట్ల సరైన సమాధానాలను నేరుగా మోదీ ద్వారా పొందడం జరిగింది. సానుకూల దృక్పథం పెంపొందించుకోవడం, పట్టుదలతో చదవడం, ఏకాగ్రతను పెంచుకోవడం, సమయపాలన పాటించడం, మానసిక ఆరోగ్యం పొందడం, ఆత్మవిశ్వాసం పెంచుకోవడం, ఉన్నత లక్ష్యాలను సాకారం చేసుకోవడానికి క్రమశిక్షణతో చదవడం, ప్రశాంతంగా పరీక్షా హాలులోకి ప్రవేశించడం లాంటి అంశాల పునాదిగా కొనసాగిన ఈ కార్యక్రమం ఫలితంగా ఉత్తమ ఫలితాలు పొందడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలు ధైర్యంగా రాయడానికి కావలసిన మానసిక ప్రశాంతతలు, సరైన చిట్కాలు, పోషకాహార ప్రాముఖ్యత, అందరి నుంచి విని మనదైన శైలిలో సాగడం, విద్యతో పాటు నైపుణ్యాలు నేర్చుకోవడం, జీవన నైపుణ్యాలు అలవరచుకోవడం లాంటి పలు ఆసక్తికరమైన సూచనలు, విద్యార్థులు అడిగిన ప్రతి ప్రశ్నలకు మోదీ ధీన సమాధానాలు, బాల కవుల కవితలు, పిల్లలు గీసిన బొమ్మలు, పాడిన పాటలతో ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా, ఆచరణ యోగ్యంగా కొనసాగడం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచడానికి, ఉత్తమ ఫలితాలను చేజిక్కించుకోవడానికి విద్యా మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ "పరీక్షా పే చర్చా" కార్యక్రమం చక్కగా ఉపయోగపడుతున్నది. 03 అక్టోబర్ 2014 రోజు భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన మరో వినూత్న కార్యక్రమం "మన్ కీ బాత్ (మనసులో మాట)" ద్వారా ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం అయ్యింది. అప్పటి నుంచి ప్రతి నెల చివరి ఆదివారం రోజు ఉదయం 11 గంటలకు ఈ రేడియో ప్రసారం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 23 జాతీయ భాషలు, 31 మాండలికాల్లో ప్రసారం అవుతున్నది. వీటికి తోడుగా ఇంగ్లీష్‌తో పాటు 11 అంతర్జాత భాషల్లో కూడా ప్రసారం కావడం విశేషం. 30 ఏప్రిల్ 2023 రోజు 100వ మన్ కీ బాత్ ప్రసారం అయ్యింది. 25 జనవరి 2026 రోజు నిర్వహించనున్న మన్ కీ బాత్ కార్యక్రమం 130 ఎపిసోడ్‌గా నిలువనుంది. 27 జనవరి 2015 రోజు ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా హాజరు కావడం, 19 సెప్టెంబర్ 2019 రోజు లా మంగేష్కర్ ప్రత్యేక అతిథిగా హాజరు కావడం గమనార్హం. ప్రతి మాసం ప్రసారం అవుతున్న ఈ రేడియో కార్యక్రమంలో కనీసంగా 23 కోట్ల మంది వింటున్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై ప్రజలతో నేరుగా కనెక్ట్ కావడం వల్ల ప్రజలు చైతన్యవంతమగు కావడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిపించడం, ప్రత్యేక అర్హతలు ఉన్న పౌరులను ప్రస్తావించడం, గ్రాణులతో నేరుగా మాట్లాడడం, స్ఫూర్తిదాయక కథలు చెప్పడం, విజయ రహస్యాలను ప్రస్తావించడం, స్వచ్ఛ భారత్/బేటీ బచావో బేటీ పడావో/ఆత్మ నిర్భర్ భారత్ లాంటి అంశాలను వివరించడం, నైపుణ్యాల వృద్ధి ఆవశ్యకతను వివరించడం, యువతను మేల్కొల్పడం లాంటి లక్ష్యాలను ఈ కార్యక్రమం సుసాధ్యం చేస్తున్నది. భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలిగిన ధీరుడు. దేశాభివృద్ధికి గట్టి పునాదులు వేస్తూ, వికసిత్ భారత్ కలల సాకారానికి ప్రజలను భాగస్వామ్యం చేయడానికి తన వంతు విలక్షణ కార్యక్రమాలను నిర్వహించడం శుభ పరిణామం. శాస్త్ర సాంకేతిక విప్లవ ఫలాలను వినియోగించుకుంటూ ప్రతి నెల ఒకసారి రేడియో ద్వారా, ప్రతి ఏట ఫిబ్రవరి మాసంలో "పరీక్షా పే చర్చా" నిరాటకంగా అనర్గళంగా నిర్వహించడం సముచితం, అద్వితీయం, అమోఘం, అనుసరణీయం, అభినందనీయం. మన నరేంద్రుడు చూపిన మార్గంలో పిల్లలు వార్షిక పరీక్షలు రాసి తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరుకుందాం.

# నిద్ర కరువైతే నీలివేణికి ముప్పే




నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నిద్రలేమి. సరిగ్గా నిద్రపోకపోవడం వల్ల కేవలం అలసట మాత్రమే కాదు, శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా మనం గాఢ నిద్రలో లేనప్పుడు శరీరంలో కార్టిసోల్ అనే ఒత్తిడి హార్మోన్ స్థాయిలు అసాధారణంగా పెరుగుతాయి. ఈ హార్మోన్ హెచ్చుతగ్గులు నేరుగా మన జుట్టు ఆరోగ్యంపై పడి, ఊహించని విధంగా జుట్టు రాలడానికి దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో పెరిగిన కార్టిసోల్ ప్రభావం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థలో ఆటంకాలు ఏర్పడతాయి. సాధారణంగా జుట్టు కుదుళ్లకు అందాల్సిన రక్త ప్రసరణ ఈ హార్మోన్ వల్ల తగ్గిపోతుంది. దీనివల్ల కుదుళ్లకు అవసరమైన ఆక్సిజన్ మరియు పోషకాలు సరైన మోతాదులో అందవు. ఫలితంగా, బలంగా ఉండాల్సిన వెంట్రుకలు క్రమంగా బలహీనపడి, చిన్నపాటి ఒత్తిడికి కూడా రాలిపోయే స్థితికి చేరుకుంటాయి. అసంపూర్తి నిద్ర కేవలం జుట్టు రాలడానికే పరిమితం కాకుండా, తల చర్మం ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. నిద్ర సరిగ్గా లేనప్పుడు శరీరంలోని సహజ మరమ్మత్తు ప్రక్రియ ఆగిపోతుంది, దీనివల్ల తల చర్మం పొడిబారడం లేదా ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఉంటుంది. చర్మం ఆరోగ్యంగా లేనప్పుడు కొత్త జుట్టు మొలవడం ఆగిపోవడమే కాకుండా, ఉన్న జుట్టు తన సహజ మెరుపును కోల్పోయి నిర్జీవంగా మారుతుంది. అందుకే అందమైన మరియు ఒత్తైన జుట్టు కావాలనుకునే వారు కేవలం షాంపూలు, నూనెలపైనే కాకుండా సరైన నిద్రపై కూడా దృష్టి సారించాలి. ప్రతిరోజూ కనీసం 7 నుండి 8 గంటల గాఢ నిద్రను పొందడం వల్ల కార్టిసోల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా జుట్టు కుదుళ్లకు పోషణ అంది, జుట్టు రాలడం తగ్గి ఆరోగ్యంగా పెరుగుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి మాత్రమే మీ జుట్టును దీర్ఘకాలం పాటు సంరక్షించగలదు.

# పసుపు పాలు తాగుతున్నారా?



ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. భారతీయ ఇళ్లలో రాత్రి పడుకునే ముందు పసుపు పాలు తాగడం అనేది ఒక ఆచారం. జలుబు చేసినా, ఒళ్లు నొప్పులుగా ఉన్నా, రోగనిరోధక శక్తి పెంచుకోవాలన్నా మనకు గుర్తొచ్చే మొదటి చిట్కా ఇదే. అయితే మనలో చాలామంది పసుపు పాలు తయారు చేసేటప్పుడు ఒక కీలకమైన పొరపాటు చేస్తున్నారని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ ఒక్క తప్పు వల్ల పసుపులోని గుణాలు శరీరానికి అందకుండా పోతున్నాయి. పసుపులో కర్కుమిన్ అనే అద్భుతమైన పదార్థం ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. మిరియాల్లో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పసుపులోని కర్కుమిన్‌ను శరీరం గ్రహించే శక్తిని ఏకంగా 2,000% పెంచుతుంది. అంటే మీరు మిరియాలు వేయకుండా పసుపు పాలు తాగితే, మీరు ఆశించిన ఆరోగ్య ప్రయోజనాలు మీకు అందవు. కర్కుమిన్ కొవ్వులో కరుగుతుంది. కాబట్టి పాలలో చిటికెడు నెయ్యి లేదా కొబ్బరి నూనె వేస్తే అది వేగంగా శరీరానికి అందుతుంది. తెల్ల చక్కెర ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పసుపు పాలలో సహజమైన తీపి కోసం బెల్లం లేదా తేనె వాడటం మంచిది. ప్యాకెట్ పసుపు కంటే పసుపు కొమ్ములను దంచి వాడితే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. రాత్రి పూట పసుపు పాలు తాగడం వల్ల ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుంది. కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులను తగ్గించడంలో ఇది కీలకంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసి చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. పసుపు పాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. పసుపు పాలు ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ.. అతిగా తాగడం వల్ల వేడి చేసే అవకాశం ఉంటుంది. అలాగే గర్భిణీలు, కిడ్నీలో రాళ్లు ఉన్నవారు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.

# రక్తహీనతను తరిమి కొట్టే సజ్జల లడ్డూ



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. అందుకే ఆరోగ్యంగా ఉండాలి అంటే తప్పకుండా మంచి ఆహారం తీసుకోవాలి. అయితే ఈ మధ్యకాలంలో చాలా మంది రక్తహీనత, ఎముకల బలహీనతతో బాధపడుతున్నారు. అలాంటి వారు మంచి ఐరన్, ఫైబర్ ఉండే సజ్జల లడ్డు రోజుకు ఒకటి తిన్నారంటే, ఎలాంటి సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారు. మరి దీనిని ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

కావాల్సిన పదార్థాలు : సజ్జలు అర కిలో, బెల్లం 500 గ్రాములు, నెయ్యి 10 టీస్పూన్స్, తెల్ల నువ్వులు, వేరుశనగలు 100 గ్రాములు, బాదం 75 గ్రాములు, ఎండు ద్రాక్ష 25 గ్రాములు, ఏలకుల పొడి వన్ టీ స్పూన్, శొంఠి పొడి పావు టీస్పూన్, ఉప్పు చిటికెడు.

తయారీ విధానం : ముందుగా స్టవ్ వెలిగించి, దానిపై పాన్ పెట్టుకొని సజ్జలను వేయించుకోవాలి. అవి వేగిన తర్వాత పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. చల్లారిన తర్వాత మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు సజ్జల పిండి రెడీ అయిపోయింది.

ఇప్పుడు మరో పాన్ తీసుకొని అందులో కొంచె నెయ్యి వేసి, తెల్ల నువ్వులు, వేరుశనగ పప్పులు, బాదం, ఎండు ద్రాక్ష వేసి దోరగా వేయించుకోవాలి. తర్వాత వీటిని పక్కన పెట్టి, అదే పాన్‌లో మరో టీ స్పూన్ నెయ్యి వేసి, మనం మిక్సీ పట్టుకున్న పిండిని దోర దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి.

ఇప్పుడు వేయించిన నువ్వులు, పల్లీలు, బాదం అన్నింటినీ మిక్సీలో వేసి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత ఈ పొడిని పక్కన పెట్టుకొని, ఒక పెద్ద బౌల్ తీసి, అందులో మనం వేయించి పక్కన పెట్టుకున్న సజ్జల పిండిని, మిక్సీ పట్టిన వేరుశనగ, నువ్వుల మిశ్రమాన్ని వేసి, కొంచెం ఉప్పు వేసి, మంచిగా కలుపుకోవాలి.

ఇప్పుడు బెల్లం పాకం ప్రిపేర్ చేసుకోవాలి. స్టవ్ ఆన్ చేసి, అందులో అర కప్పు నీళ్లు పోసి, అవి మరిగిన తర్వాత బెల్లం వేసి, పాకం వచ్చే వరకు మరిగించుకోవాలి. ది

పాకం వచ్చిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి, కొంచెం చల్లారిన తర్వాత అందులో సజ్జల పిండిని వేసి మంచిగా ఉండలు లేకుండా కలుపుకోవాలి. దీని తర్వాత చేతికి నెయ్యిని రాసుకొని, సజ్జల పిండిని చిన్నగా లడ్డూల మాదిరి చుట్టకోవాలి. అంతే ఆరోగ్యాన్ని ఇచ్చే టేస్టీ టేస్టీ సజ్జల లడ్డూలు రెడీ. మరి మీరు కూడా మీ ఇంటిలో ప్రిపేర్ చేయండి

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక
ఆదివారం | తెలంగాణ
8 ఫిబ్రవరి 2026
cknews@gmail.com

Follow: @cknews



దివి రెడ్ చీరలో అందరి దృష్టిని ఆకర్షించింది

# సక్సెస్ అయితే మరిన్ని సంచలనాలు!




సినిమా ని మించి ఓటీటీ కంటెంట్ రూల్ చేస్తోంది అన్నది కాదనలేని నిజం. క్రైమ్ థ్రిల్లర్..సస్పెన్స్ థ్రిల్లర్లు ..రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా తెరకెక్కుతోన్న వెబ్ సిరీస్ లు..డాక్యుమెంటరీలకు ఓటీటీలో ఏ స్థాయిలో ఆదరణ దక్కుతుందో కనిపిస్తూనే ఉంది. సినిమా కంటెంట్ ని మించి ఓటీటీ కంటెంట్ హైలైట్ అవుతుంది. పైగా ఓటీటీ కంటెంట్ ప్రపంచ వ్యాప్తంగా రీచ్ అవుతుంది. దీంతో వెబ్ సిరీస్ లు..డాక్యుమెంటరీలకు అదరణ అంతకంతకు పెరుగుతూనే ఉంది. ఇతర విదేశీ భాషల్లోకి ఇండియన్ కంటెంట్ డంప్ అవ్వడం చూడొచ్చు.-మీర్జాపూర్- వెబ్ సిరీస్ ఓటీటీలో ఎంత పెద్ద సక్సెస్ అయిందో తెలిసిందే. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందిన -మీర్జాపూర్- యువతను విశేషంగా ఆకట్టుకుంది. మీర్జాపూర్ నుంచి రిలీజ్ అయిన మూడు సీజన్లు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. తాజాగా ఇప్పుడీ సీరీస్ ను వెండి తెరపైకి సినిమా రూపంలో తీసుకొస్తున్నారు. -మీర్జాపూర్ : ది మూవీ- పేరుతో భారీ ఎత్తున థియేటర్లో రిలీజ్ చేస్తున్నారు. గుర్మీత్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్- ఎక్స్ ఎంల్ ఎంటర్ టైన్ మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకున్న -మీర్జాపూర్- సెప్టెంబర్ లో రిలీజ్ అవుతుంది. మూడు సిరీస్ లకు ఇది ప్రీక్వెల్ గా ఉండబోతుంది. మూడు సీజన్లలో నటించిన నటీనటులే సినిమాలోనూ భాగమయ్యారు. దర్శక, నిర్మాతలు సినిమాగా తీసుకొస్తున్న ఈ సిరీస్ పై చాలా ఆశలు పెట్టుకున్నారు. థియేటర్లో సైతం గ్రాండ్ విక్టరీ నమోదు చేస్తుందని ఆశీస్తున్నారు. అదే జరిగితే థియేట్రికల్ గా మరిన్ని వెబ్ సిరీస్ లు రిలీజ్ అవ్వడం ఖాయం. -సేక్రేడ్ గేమ్స్-, ద
-ది ఫ్యామిలీ మ్యాన్- ,-పాతాళ్ లోక్-, -స్కామ్ 1992-, -ఢిల్లీ క్రైమ్-, -పంచాయత్-, -కోటా ఫ్యాక్టరీ-, -ఫర్జీ-, -అసుర్- లాంటి వెబ్ సిరీస్ లు సినిమాలగా ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశం లేకపోలేదు.ఈ వెబ్ సిరిస్ లు దేశ వ్యాప్తంగా పాపులర్ అయిన సిరీస్ లు. కోట్లాది మంది వీక్షించారు. ప్రత్యేకమైన ప్యాన్ బేస్ ఉంది. ఈ సిరీస్ లకు కొనసాగింపు, సీక్వెల్స్ , ప్రీక్వెల్స్ రావాలంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఒకవేళ అందుకు ఆస్కారం లేకపోతే? రెండున్నర గంటల నిడివితో సిరీస్ లు అన్నింటిని కలిపి సినిమా గా తీసినా ఆస్వాదించడానికి సిద్దంగా ఉన్నారు. అలాగే భారత్ లో యానిమేషన్ చిత్రాలకు కూడా ఆదరణ మొదలైంది. ఆ మధ్య రిలీజ్ అయిన -మహావతార్ నరసింహ-కు విశేష ఆదరణ లభించిన సంగతి తెలిసిందే.
అప్పటి వరకూ యానిమేషన్ చిత్రాలంటే ఆడియన్స్ లైట్ తీసుకునే వారు. కానీ త్రీడీ ఫార్మెట్ లో రిలీజ్ అవ్వడం భక్తి నేపథ్యం గల కంటెంట్ కావడంతో కోట్లాది మంది ఆదరించారు. యానిమేషన్ రూపంలో ఇప్పటికే చాలా కంటెంట్ ఉంది. పెరిగిన టెక్నాలజీ యుగంలో వాటిని సినిమాలగా తీస్తే మంచి ఆదరణ లభిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



సిమ్రాన్ చౌదరి నేచురల్ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది



# యష్ 'టాక్సిక్'.. తెలుగు టార్గెట్ రీచ్ అవుతుందా?

స్టార్ హీరో యష్.. ఇప్పుడు టాక్సిక్ మూవీతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ ట్యాగ్ లైన్ తో రూపొందుతున్న ఆ చిత్రానికి గీతూ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. సమ్మర్ కానుకగా మార్చి 19వ తేదీన సినిమా వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుండగా.. ఇప్పటికే ఆ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు మేకర్స్. వరుస ప్రమోషనల్ కంటెంట్ ను రిలీజ్ చేసేందుకు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా.. వాటిని మరింత పెంచేలా ప్లాన్ చేసుకుంటున్నారు.అయితే పాన్ ఇండియా వైడ్ గా సినిమా రిలీజ్ కానుండగా.. తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్ కోసం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు చెందిన థియేట్రికల్ హక్కులను పీవీఆర్- ఐనాక్స్ సొంతం చేసుకుంది. ఇప్పటికే ఆ విషయాన్ని అనౌన్స్ చేసింది. అయితే సుమారు రూ.40 కోట్ల అడ్వాన్స్ కు తెలుగు స్టేట్స్ రైట్స్ ను పీవీఆర్- ఐనాక్స్ దక్కించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి.దీంతో యష్ కెరీర్ లోనే కాకుండా తెలుగులో కన్నడ హీరోలకు సంబంధించిన సినిమాల్లో టాక్సిక్ టాప్ డీల్ అని తెలుస్తోంది. కేజీఎఫ్ సిరీస్ చిత్రాల విజయాల తర్వాత యష్ మార్కెట్ రేంజ్ పెరిగిన విషయం తెలిసిందే. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కేజీఎఫ్ 2 బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టి నిర్మాతలకు లాభాల వర్షం కురిపించింది. రూ.79 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలో దిగిన ఆ మూవీ.. కంప్లీట్ రన్ లో రూ.140 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది.ఇప్పుడు అదే నమ్మకంతోనే టాక్సిక్ పై పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టినట్లు అర్థమవుతుంది. అయితే దానికి తగ్గట్లే సినిమా వసూళ్లు సాధించాలి. టాక్సిక్ బ్రేక్ ఈవెన్ కావాలంటే కనీసం కేజీఎఫ్ ఛాప్టర్ 2 ఫైనల్ కలెక్షన్లలో సగం వసూలు చేయాల్సి ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేసినట్లు తెలుస్తోంది. అంటే రూ.70 కోట్లకుపైగా వసూలు చేయాలన్నమాట. అదే జరగాలి అంటే.. సినిమాకు మంచి పాజిటివ్ టాక్ రావాలి.. కంటెంట్ అదిరిపోయేలా ఉండాలి. అప్పుడు ఆ నెంబర్ ను సొంతం చేసుకునే ఛాన్స్ ఉంటుంది.అదే సమయంలో బడా సినిమాల థియేట్రికల్ హక్కులను కార్పొరేట్ సంస్థలు సొంతం చేసుకోవడం ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో ఒక ట్రెండ్ గా మారింది. అలా టాక్సిక్ మూవీని పీవీఆర్- ఐనాక్స్ డిస్ట్రిబ్యూట్ చేయడం వల్ల రిలీజ్ మరింత గ్రాండ్ గా ఉండేలా కనిపిస్తుంది. స్క్రీన్ కౌంట్ కూడా భారీగా పెరిగే ఛాన్స్ ఉంది. దీంతో ఇప్పుడు టాక్సిక్ మూవీ.. తెలుగులో ఎలాంటి హిట్ అవుతుందో.. ఎంతటి వసూళ్లు సాధిస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.
ఇక సినిమా విషయానికొస్తే.. భారీ బడ్జెట్ తో స్టైలిష్ యాక్షన్ డ్రామాగా కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వెంకట్ కె నారాయణ, యష్ సంయుక్తంగా గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మూవీలో యష్‌తో పాటు అందాల భామలు కియారా అద్వానీ, హుమా ఖురేషీ, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్ నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నారు.